తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

వరంగల్ - ఆదిలాబాద్

హన్మకొండ | జనగాం | ములుగు | నిర్మల్ | మంచిర్యాల | ప్రొ. జయశంకర్ భూపాలపల్లి | కొమురం భీం ఆసిఫాబాద్ | మహబూబాబాద్

మంగళవారం 11 ఆగస్టు 2026 | పేజీలు - 12



## సూర్యచంద్రులున్నంత వరకు ప్రజల గుండెల్లో పెద్ది

- బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్
- నల్లబెల్లిలో పెద్ది సుదర్శన్ రెడ్డి సంతాప సభ
- జనసంద్రంగా మారిన మండల కేంద్రం
- పెద్దికి నాయకుల కన్నీటి నివాళులు

**నల్లబెల్లి, ఆగస్టు 10 (జనంసాక్షి):** సూర్యచంద్రులున్నంత వరకు ప్రజల గుండెల్లో పెద్ది సుదర్శన్ రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోతాడని తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలో సోమవారం పెద్ది సుదర్శన్ రెడ్డి సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే హరీశ్‌రావు, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దీంతో నల్లబెల్లి మండల కేంద్రం జనసంద్రంగా మారింది. సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రజలకు చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. కృషి, పట్టుదల, అంకితభావం కలిగిన నాయకుడిగా పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. అలాంటి నాయకుడు మన మధ్య లేకపోవడం అత్యంత బాధాకరమని కేటీఆర్ భావోద్వేగానికి గురయ్యారు. ప్రజల కోసం నిరంతరం పనిచేసిన పెద్ది సేవలు, ఆయన ఆశయాలు ఎప్పటికీ మిగతా 13లో..

# రైతుకు అండగా.. వ్యవసాయానికి భరోసాగా రాష్ట్ర ప్రభుత్వం

- రైతుల కోసం నెలకు సగటున రూ.5,250 కోట్లు ఖర్చు చేస్తున్నాం
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి




**హనుమకొండ, ప్రతినిధి ఆగస్టు 10 (జనం సాక్షి) :** రైతును రాజుగా చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అంతగా అనుకూలంగా లేకపోయినా రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆత్మ సౌజన్యంతో నిర్వహించిన జిల్లాస్థాయి రైతు మేళాను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో గత రెండేళ్లుగా అనేక ఒడిదుడుకులను అధిగమిస్తూ ముందుకు సాగుతున్నామని అన్నారు. గత ప్రభుత్వం రైతుల కోసం నెలకు సగటున రూ. 2,500 కోట్లు ఖర్చు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం రైతుల కోసం నెలకు సగటున రూ. 5,250 కోట్లు వివిధ రూపాల్లో ఖర్చు చేస్తోందని తెలిపారు. రైతు సంక్షేమంపై ప్రభుత్వం తీసుకున్న నిబద్ధతకు ఇది నిదర్శనమన్నారుయాసంగి సీజన్‌లో రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి ప్రభుత్వం పూర్తి మద్దతు అందించిందని, ధాన్యం కొనుగోలు సమయంలో కొన్ని ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదురైన విషయం వాస్తవమేనని మంత్రి పేర్కొన్నారు. గతంలో తగిన గోదాముల నిర్మాణం, ధాన్యం నిల్వకు అవసరమైన మౌలిక వసతులు కల్పించకపోవడం వల్ల సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోదాముల సామర్థ్యాన్ని దాదాపు రెట్టింపు చేసిందని చెప్పారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ జిల్లా స్థాయి రైతు మేళా ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతికతలు, శాస్త్రీయ విధానాలపై అవగాహన కల్పించడం ఎంతో ఉపయోగకరమని అన్నారు. శాస్త్రవేత్తలు, ప్రగతిశీల రైతుల సూచనలు, అనుభవాలను రైతులు సద్వినియోగం చేసుకుని, వ్యవసా యంలో కొత్త విధానాలను అనుసరించి ఉత్పాదకత, ఆదాయాన్ని పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు. రైతు మేళాలో వ్యవసాయ, ఉద్యానవన, ఇతర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ, వ్యవసాయేతర ఉత్పత్తుల స్టాళ్లను మంత్రి, ప్రజాప్రతినిధులు, రైతులు సందర్శించారు. నూతన సాగు పద్ధతులు, ఆధునిక వ్యవసాయ సాంకేతికత, విత్తనాలు, పంటల సాగు విధానాలు, మిగతా 13లో..

## తూర్పు డివిజన్‌ను శాసిస్తున్న ఆర్ఎంపీలు!

- అనుమతి లేని వైద్యం.. గ్రామాల్లో బ్లడ్ టెస్టులు..
- మెడికల్ షాపుల నిర్వహణపై ఆరోపణలు
- పేద గ్రామీణ ప్రజలే టార్గెట్.. నిబంధనలకు విరుద్ధంగా
- వైద్య సేవలు కొనసాగుతున్నాయన్న ఫిర్యాదులు

**కాటారం, ఆగస్టు 10: (జనం సాక్షి):** తూర్పు డివిజన్ పరిధిలో కొందరు ఆర్ఎంపీలు, గ్రామీణ వైద్యుల పేరుతో వైద్య సేవలు అందిస్తున్న వ్యక్తుల వ్యవహారంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో అర్హతలు, అనుమతులు లేకుండానే వైద్యం చేస్తున్నారనే ఫిర్యాదులతో పాటు, రక్త పరీక్షలు నిర్వహించడం, మందులు విక్రయించడం, మెడికల్ షాపుల నిర్వహణ వంటి కార్యకలాపాలు కూడా కొనసాగుతున్నాయన్న ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

గ్రామాల్లో ప్రభుత్వ వైద్య సేవలు అందుబాటులో లేకపోవడం, దూర ప్రాంతాలకు వెళ్లలేని పరిస్థితుల్లో ఉన్న పేదలు, కూలీలు, వృద్ధులు, మహిళలు స్థానికంగా అందుబాటులో ఉండే వ్యక్తులనే ఆశ్రయిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ పరిస్థితిని కొందరు వ్యక్తులు తమకు అనుకూలంగా మలుచుకుని వైద్య సేవల పేరుతో అధిక మొత్తాలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

### అనుమతులు లేకుండానే వైద్య సేవలా?

వైద్య వృత్తికి సంబంధించిన నిబంధనలు, అర్హతలు, అనుమతులను పక్కనపెట్టి కొందరు గ్రామాల్లో రోగులకు ఇంజెక్షన్లు, సెలైన్లు, మందులు ఇవ్వడంతో పాటు వివిధ రకాల చికిత్సలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిన్నపాటి అనారోగ్యాల నుంచి తీవ్రమైన ఆరోగ్య సమస్యల వరకు ఒకే వ్యక్తి వద్ద చికిత్స పొందే పరిస్థితి నెలకొన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

ఇలాంటి వ్యవహారాల్లో రోగుల ఆరోగ్య పరిస్థితిని సరైన వైద్యుడు పరిశీలించకపోవడం వల్ల సమస్యలు తీవ్రమయ్యే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా అత్యవసర చికిత్స అవసరమైన సందర్భాల్లో ఆలస్యం జరిగితే ప్రాణాపాయం కూడా




సంభవించే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు.

### గ్రామాల్లో బ్లడ్ టెస్టులపై ప్రశ్నలు

కొన్ని గ్రామాల్లో సరైన అనుమతులు, సాంకేతిక ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అన్నది స్పష్టత లేని పరిస్థితుల్లోనే రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రక్త నమూనాల సేకరణ, మిగతా 13లో..



## కర్రెగుటల్లో డీజీపీ పర్యటన

- కర్రెగుటలో అభివృద్ధికి సువర్ణ అధ్యాయానికి డిజిపి అడుగులు.
- హింసకు స్వస్తి.. సమాజంలో భాగస్వామ్యం కావాలని డిజిపి సివి ఆనంద్ సందేశం.
- లొంగిపోవాలని గణపతి దంపతులకు పోలీసుల పిలుపు.
- కాకరాల సమత కి 20 లక్షల రూపాయల చెక్ అందజేత.
- పునరావాస విధానంతో ఇప్పటివరకు లొంగిపోయిన 23 మందికి రూ.2 కోట్ల వరకు సాయం.

**ములుగు ప్రతినిధి, ఆగష్టు 10(జనంసాక్షి) :** ఆపరేషన్ కగార్ తో తెలంగాణ ఆంధ్ర చత్తీస్గడ్ సరిహద్దు ప్రాంతాలలో ఉన్న కర్రెగుట్టలను జల్లెడ పట్టిన భద్రతా బలగాల కృషి వమ్ము కాలేదు. నాడు కర్రెగుట్టల దండకారణ్యంలో తుపాకుల మోతలతో తూటాల వర్షం కురిసి రక్తమోడిన నేల నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో లొంగిన మావోయిస్టుల కంచుకోటలో నేడు మిగతా 13లో..

# మోడీ వినాశనకర విధానాలకు ప్రతిఘటన తప్పదు

- రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో భారీ రాస్తారోకో
- స్తంభించిన ట్రాఫిక్ - నాయకులను అరెస్టు చేసిన పోలీసులు



**వరంగల్ ఈస్ట్, ఆగస్టు 10 (జనం సాక్షి)** స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు,లేబర్ కోడ్స్ లాంటి వినాశనకర విధానాలతో రైతులను కార్మికులను అధోగతి పాలు చేస్తున్న మోడీ ప్రభుత్వానికి ప్రతిఘటన తప్పదని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కే యం) రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్, జిల్లా కన్వీనర్లు చుక్క మొగిలి సోమిడి శ్రీనివాస్ రాచర్ల బాలరాజు చిర్ర సూరి సుధమల్ల భాస్కర్ వల్లందాస్ కుమార్, ఏఐసిటియు జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, ఐ ఎన్ టి యు సి జిల్లా కార్యదర్శి పాశం రవి, ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్, ఏఐసీసీటియు జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి హెచ్చరించారు. సోమవారం సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కె ఎం) రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జైల్ భరో పిలుపులో భాగంగా వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో భారీ రాస్తారోకో చేపట్టారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దాంతో ట్రాఫిక్ భారీగా స్తంభించింది. ఈ క్రమంలో పోలీసులు కలుగజేసుకొని రాస్తారోకో చేస్తున్న రైతు కార్మిక సంఘాల నాయకులను బలవంతంగా అరెస్టు చేసి ఆందోళనను విరమింప చేశారు. ఈ సందర్భంగా ఎస్కేయం జిల్లా కన్వీనర్ కుసుంబా బాబురావు కార్మిక సంఘాల బాధ్యుడు గంగుల దయాకర్ అధ్యక్ష వర్గంగా జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం స్వదేశీ నినాదం పేరు చెప్పి ఆచరణలో అమెరికా లాంటి విదేశాలకు అనుకూలంగా విధానాల రూపకల్పన చేసి స్వదేశీ వ్యవసాయాన్ని రైతులను సంక్షోభంలోకి నెట్టివేస్తున్నారని ఈ క్రమంలో రైతు ఆత్మహత్యలు పెరిగి పోతున్నాయని రైతులు వ్యవసాయాన్ని వదిలి కూలీలుగా కార్మికులుగా మారిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులతో పండిన పంటలకు సరైన మార్కెట్ సౌకర్యం లేక గిట్టుబాటు ధర రాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతాంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టివేసే విధంగా 32 దేశాలతో స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను చేసుకొని అక్కడి ఉత్పత్తులను మనదేశంలోకి అనుమతించడం దారుణం అన్నారు. అమెరికా లాంటి దేశంలో రైతులకు అనేక సబ్సిడీలు రాయితీలు అందించి ప్రోత్సహిస్తుంటే మనదేశంలో మాత్రం అందు విరుద్ధంగా ఉంటున్నారు ఇలాంటి పరిస్థితుల్లో స్వేచ్ఛ వాణిజ ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలన్నారు. అలాగే రైతాంగ ఉద్యమానికి ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని మద్దతు ధర రుణ విముక్తి చట్టం చేయాలని కేంద్ర విద్యుత్తు విత్తన చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉత్పత్తిలో కీలక భూమిక పోషించే కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబరు కోడ్స్ ను తక్షణమే రద్దుచేసి పాత కార్మిక చట్టాలను అమలు చేయాలన్నారు. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా అమలు చేయాలని కోరారు. లేకపోతే రైతులు కార్మికులు ఐక్యంగా ప్రజలందరినీ కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు కార్మిక సంఘాల రాష్ట్ర జిల్లా నాయకులు సింగతి సాంబయ్య నర్ర ప్రతాప్ నెట్టెం నారాయణ చుంచు జగదీశ్వర్ మాలోతు సాగర్ పుల్ల రమేష్ ఓదెల రాజన్న బండి వెంకటేశ్వర్లు హంసల్ రెడ్డి బొల్లు ఎల్లయ్య ఎంఏ పాషా చుక్క శోభ పూలక్కా పిడి ఎస్ యు పృథ్వి నర్సింగం బాబు రామస్వామి చిన్న రాజేందర్ ఐలయ్య ఎగ్గని మల్లికార్జున్ మాలి ప్రభాకర్ గణిపాక ఓదేలు అప్పనపుడి నరసయ్య నలివెల రవి సుమంత్ చారిలతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# మారిన వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంట మార్పిడి చేపట్టాలి

- ఆయిల్ ఫామ్ సాగుతో రైతులకు దీర్ఘకాలిక ఆదాయం
- కుబీర్, బెల్గాం తండాల్లో ప్రత్యేక గ్రామసభలు



**కుబీర్, ఆగస్టు 10, (జనంసాక్షి):** మారిన వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు సాంప్రదాయ పంటలకు స్వస్తి పలికి, పంటల వైవిధ్యీకరణ (పంట మార్పిడి) వైపు అడుగులు వేయాలని వ్యవసాయ విస్తరణ అధికారి కదం సందేశ్ పటేల్ పిలుపునిచ్చారు. కుబీర్ మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంతో పాటు, బెల్గాం తండాలో 'ఎల్ నినో ప్రభావం - పంటల వైవిధ్యీకరణ' అనే అంశంపై ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈవో సందేశ్ పటేల్ మాట్లాడుతూ.. ప్రస్తుత వాతావరణ మార్పులు, ఎల్ నినో ప్రభావం వల్ల వర్షపాతంలో అనిశ్చితి ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఒకే రకమైన పంటలపై ఆధారపడి నష్టపోకుండా, తక్కువ నీటితో ఎక్కువ దిగుబడినిచ్చే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. రైతులకు స్థిరమైన, దీర్ఘకాలిక ఆదాయాన్ని అందించడంలో ఆయిల్ ఫామ్ సాగు ఒక అద్భుతమైన అవకాశమని ఏఈవో రైతులకు వివరించారు. సంప్రదాయ పంటలతో పోలిస్తే దీని ద్వారా ప్రతి ఏటా మంచి లాభాలు ఆర్జించవచ్చని, ప్రభుత్వం కూడా దీనికి అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తోందని తెలిపారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో నీటి కొరతను అధిగమించడానికి ప్రతి రైతు తమ పొలాల్లో వ్యవసాయ నీటి కుంటలను (ఫామ్ పాండ్స్) నిర్మించుకోవాలని సూచించారు. కురిసిన ప్రతి వర్షపు చుక్కను ఈ కుంటల ద్వారా భూమిలోనే సంరక్షించుకోవడం వల్ల, అత్యవసర సమయాల్లో పంటలను ఎండిపోకుండా కాపాడుకోవచ్చని స్పష్టం చేశారు.

**ఎరువుల యాప్‌పై అవగాహన..**

**పంట వివరాల నమోదు తప్పనిసరి**

పంటల సాగులో ఎరువుల వినియోగాన్ని క్రమబద్ధీకరించడానికి మరియు భూసారానికి అనుగుణంగా ఎరువులు వాడటానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎరువుల యాప్ పై రైతులకు ఈ సభలో ప్రత్యేక అవగాహన కల్పించారు. యాప్ ద్వారా ఎరువుల లభ్యత, సరైన మోతాదును తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే, రైతులు తాము సాగు చేస్తున్న పంటల వివరాలను తప్పనిసరిగా అధికారుల వద్ద నమోదు (క్రాప్ బుకింగ్) చేసుకోవాలన్నారు. దీనివల్ల ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, పంట నష్టపరిహారం, బీమా సదుపాయాలు పొందడానికి వీలవుతుందని వివరించారు. ఈ ప్రత్యేక గ్రామసభల్లో సర్పంచులు కందూరు సాయినాథ్, జాదవ్ గోకుల్, పంచాయతీ కార్యదర్శులు మాధవ్, ముజాహిద్, వ్యవసాయ శాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతులు గ్రామస్థులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో ఏఆర్ఎస్ఐ శామ్యూల్ మృతి



**వరంగల్ ఈస్ట్, ఆగస్టు 10( జనం సాక్షి)** వరంగల్ కమిషరేట్ ఆర్మూర్ రిజర్వ్ విభాగంలో ఏఆర్ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న శామ్యూల్ (57) సోమవారం ఉదయం సమయంలో హనుమకొండలోని ప్రకాష్ రెడ్డి పేట జంక్షన్ వద్ద గల తన నివాసంలో ఆకస్మిక గుండెపోటుతో మృతి చెందారు. విధులకు హాజరయ్యేందుకు బయలుదేరుతున్న సమయంలో ఆయనకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. 1989న పోలీస్ శాఖలో విధుల్లో చేరిన శామ్యూల్ సుమారు 37 సంవత్సరాలుగా పోలీస్ శాఖలో సేవలందించారు.ఆయన మృతి పట్ల పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపిఎస్ తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు.

# ఘనంగా మాజీ కేంద్రమంత్రి జయంతి వేడుకలు



**కమలాపూర్, ఆగస్టు 10 (జనం సాక్షి ):-** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో మాజీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుండపు చరణ్ పటేల్ ఆధ్వర్యంలో మాజీ కేంద్రమంత్రి పుంజాల శివశంకర్ 97 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా చరణ్ పటేల్ మాట్లాడుతూ పుంజాల శివశంకర్ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ కి సలహాదారుడిగా ఉంటూ బీసీ ల రిజర్వేషన్ల కోసం ప్రత్యేక కృషి చేశారని అన్నారు. కేంద్ర మంత్రి గా,వివిధ రాష్ట్రాలకు గవర్నర్ గా బాధ్యతలు చేపట్టి అనేక సేవలందించారని కొనియాడారు. న్యాయ శాస్త్రం లో పట్టా పొందిన ఆయన న్యాయ వ్యవస్థ లో ట్రాన్ఫర్ ఆఫ్ జడ్జెస్ విధానాన్ని తీసుకువచ్చి న్యాయ వ్యవస్థ లో కూడా బీసీ లకు ప్రాధాన్యత కల్పించిన వ్యక్తి శివశంకర్ అని అన్నారు. ఆయన జీవిత పుస్తకంలో బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం చేపట్టినప్పుడే పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్యుఐ నాయకులు పాల్గొన్నారు.

# నీరుకుళ్ళలో కోతుల బీభత్సం

**వ్యక్తిపై దాడి, తీవ్ర గాయాలు**



**ఆత్మకూరు, ఆగస్టు 10 (జనం సాక్షి):** హన్మకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్ళ గ్రామంలో కోతులు ఒక్కసారిగా దాడికి తెగబడటంతో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. గ్రామంలో కోతుల బెడద రోజురోజుకూ మితిమీరిపోతుండటంతో స్థానికులు తీవ్ర భయాందోళనల మధ్య కాలం వెళ్లదీస్తున్నారు.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నీరుకుళ్ళ గ్రామానికి చెందిన భూసాలి శ్రీను అనే వ్యక్తి ఇంటి వద్దకు కోతుల మంద వచ్చింది. వాటిని గమనించిన శ్రీను కర్ర పట్టుకుని తరిమేందుకు ప్రయత్నించాడు. అయితే, ఆ కోతులు భయపడకుండా ఒక్కసారిగా శ్రీనుపై తిరగబడ్డాయి. తీవ్ర ఆగ్రహంతో శ్రీను మెడపై పంటితో కొరికి, గోళ్లతో గీరడంతో ఆయనకు తీవ్ర రక్తస్రావమైంది.బాధితుడి అరుపులు విన్న చుట్టుపక్కల వారు వెంటనే అక్కడికి చేరుకుని కోతులను తరిమికొట్టారు. తీవ్రంగా గాయపడిన శ్రీనును చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో కోతుల దాడులు ఎక్కువవుతున్నాయని, అటవీ శాఖ అధికారులు వెంటనే స్పందించి కోతులను పట్టుకోవాలని నీరుకుళ్ళ గ్రామస్తులు కోరుతున్నారు.

# ఎల్లాయగూడెంలో మహా అన్నదానం



**చెన్నారావుపేట, ఆగస్టు 10 ( జనం సాక్షి):** మండలంలోని ఎల్లాయగూడెం గ్రామంలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ ఉద్యమకారుడు దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి సంతాప సభ మహా అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బాల్నె వెంకన్న, మండల ఎన్నికల కన్వీనర్ జక్కు అశోక్, సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షులు కుండె మల్లయ్య, బిఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొండవీటి ప్రదీప్ కుమార్, మండల యూత్ అధ్యక్షులు మంచోజు మనోజ్ కుమార్ లు నివాళులర్పించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డి నర్సంపేట నియోజకవర్గం లో చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు సాంబయ్య, కందికొండ విజయ్, మంద రవికుమార్, మంచోజు వెంకటేశ్, మంద సంతోష్, వేముల రాఘవేంద్ర, ఎదురబోయిన స్వామి, సంజయ్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం

## టీసీఎస్ మెగా క్యాంపస్ డ్రైవ్ : జిల్లా కలెక్టర్ రాజర్షి షా



మావల ఆగస్ట్ 11( జనం సాక్షి): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రముఖ ఐటీ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్), జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు 11 (మంగళవారం) మెగా క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మెగా క్యాంపస్ డ్రైవ్ ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు ఆదిలాబాద్ పట్టణంలోని నలంద డిగ్రీ కాలేజ్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. 2024, 2025, 2026 సంవత్సరాల్లో బిఏ , బి.కామ్,బి.ఎస్ సి డిగ్రీ పూర్తి చేసిన లేదా ఈ ఏడాది పూర్తి చేయనున్న విద్యార్థులు ఈ డ్రైవ్‌కు అర్హులని పేర్కొన్నారు. అర్హులైన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను చాటుకోవాలని కలెక్టర్ సూచించారు. అభ్యర్థులు అధికారిక ప్రకటనలో పొందుపరిచిన ాు= కోడ్‌ను స్కాన్ చేసి లేదా లింక్ ద్వారా ముందస్తుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. క్యాంపస్ డ్రైవ్‌కు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 9502786438, 9849913061 నంబర్లను లేదా జిల్లా ఉపాధి కల్పనా అధికారిని సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు.

# క్విట్ ఇండియా స్ఫూర్తితో పోరాడాలి

## మతోన్మాదంపై ఉద్యమ గర్జన ,రాజ్యాంగ రక్షణకు రోడ్డెక్కిన కార్మికులు

## దేవరుప్పుల గడ్డపై గర్జించిన కార్మిక లోకం




**దేవరుప్పుల, ఆగస్టు 10 (జనం సాక్షి):** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో మతోన్మాదాన్ని వ్యతిరేకిస్తూ రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సింగారపు రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం దేవరుప్పుల మండల కేంద్రంలో జైల్‌భరో కార్యక్రమంలో భాగంగా వ్యకాసా, రైతుసంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువత ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లు, విత్తన చట్టం, విద్యుత్ సవరణ చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, కార్మికుల హక్కులను పరిరక్షించాలని కోరారు. నిత్యావసర ధరల పెరుగుదల, నిరుద్యోగం, విద్యా, వైద్య రంగాల ప్రైవేటీకరణతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బసవ రామచంద్రం, సీఐటీయూ మండల కార్యదర్శి బత్తిని వెంకన్న, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు ఇంటి వెంకటరెడ్డి, రైతుసంఘం మండల కార్యదర్శి పయ్యావుల భిక్షపతి, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కొప్పుల ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యాసంస్థలను కార్పొరేట్ స్థాయికి తీర్చిదిద్దుతున్నాం

- రూ.3.25 కోట్లతో ఎల్కతుర్తిలో కేజీబీవీ నూతన భవనం ప్రారంభం - మంత్రులు పొంగులేటి, పొన్నం
- పేద, మధ్యతరగతి పిల్లలకు నాణ్యమైన విద్యే ప్రభుత్వ లక్ష్యం



**ఎల్కతుర్తి, ఆగస్టు 10 (జనం సాక్షి) :-** పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించి వారిని తమ కాళ్లపై తాము నిలబడేలా చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వ విద్యాసంస్థలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ అన్నారు. రూ. 3.25 కోట్ల వ్యయంతో ఎల్కతుర్తిలో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం నూతన భవనాన్ని ఆదివారం వారు ప్రారంభించారు.

# రాష్ట్రీయ స్వయంసేవాక్ 100వ శతాబ్ది ఉత్సవ సమ్మేళనం



**సారంగాపూర్,ఆగస్టు10(జనం సాక్షి)** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో 10న కరుణాకర్ రెడ్డి ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విభాగ సంపర్క్ ప్రముక్ కొట్టూర్ శ్రీధర్, సంఘ ప్రముఖ శివశంకర్, మానవీయ జిల్లా సంఘ చాలక్ నూకల విజయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాల భాగంగా యువతలో దేశభక్తి, ధర్మరక్షణ, కర్తవ్యనిష్ఠ, సామాజిక సేవాభావం జాతీయ చైతన్యాన్ని పెంపొందించే లక్ష్యంతో “హిందూ యువ సమ్మేళనం” నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నేటి యువత దేశ భవిష్యత్తుకు బలమైన పునాది అని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్ర, మహనీయుల త్యాగాల గురించి ప్రతి యువకుడు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. సమాజ సేవ, జాతీయ సమైక్యత, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం వంటి విలువలను యువతలో పెంపొందించేందుకు ఈ సమ్మేళనం వేదికగా నిలుస్తుందని చెప్పారు. హిందూ యువ సమ్మేళనానికి 15 నుండి 35 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు, యువకులు, మేధావులు హిందూ సమాజంలోని ప్రతి ఒక్కరూ పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సమాజానికి సేవ చేయాలనే స్ఫూర్తి, దేశభక్తి భావన, యువత బాధ్యతలపై ప్రముఖుల ప్రసంగాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన పూర్తి వివరాలను పోస్టర్‌లోని క్యూఆర్ కోడ్ ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో బొద్దుల అశోక్ జిల్లా కార్యవాహక్, అల్లాడి సత్యనారాయణ విశ్రాంత ఉపాధ్యాయులు, రాము, గంగాధర్, కరిపి విలాస్, గంగాధర్, పిల్లి గంగాధర్, ప్రకాష్, భీమన్న, ఆయా గ్రామాల యువకులు పాల్గొన్నారు.

# ఓట్ చోర్, నోట్ చోర్ నరేంద్ర మోడీని గద్దె దించండి

## హరిపిరాల నుంచి ప్రారంభమైన సీపీఐ ప్రజా చైతన్య ప్రచార పాదయాత్ర




**తొర్రూరు, ఆగస్టు 09( జనం సాక్షి):** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం హరిపిరాలలో సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య ప్రచార యాత్రను ఘనంగా ప్రారంభించారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ వల్లపు కొమురెల్లి స్మారక స్థూపం వద్ద నుంచి ఈ ప్రచార పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లిసీపీఐ జిల్లా కార్యదర్శి బి. విజయ్ సారధి హాజరయ్యి స్మారక స్థూపం వద్ద నివాళులర్పించిన అనంతరం ప్రజా చైతన్య ప్రచార యాత్రను ప్రారంబించి మాట్లాడుతూ. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జాతీయ సమితి పిలుపుమేరకు నేడు తొర్రూరు మండలంలో హరిపిరాల, కర్కాల, వెంకటాపురం గ్రామాల్లో విస్తృతంగా సిపిఐ ప్రజాచైతన్య ప్రచార యాత్ర కొనసాగింది నరేంద్ర మోడీ ఓట్ల చోరీ చేసి వివిధ రాష్ట్రాల్లో అధికారంలోకి వస్తున్నాడని రాష్ట్రాల హక్కులను ప్రధాని నరేంద్ర మోడీ హరిస్తున్నాడన్నారు వచ్చే ఎన్నికల్లో మోడీని గద్దె దించడానికి 140 కోట్ల ప్రజలు ఒక్కతాటికీ రాబోతున్నారన్నారు ఇక మోడీని గద్దె దింపడం ఖాయమన్నారు అందుకే సిపిఐ దేశ వ్యాప్తంగా ప్రచార యాత్రను నిర్వహిస్తుందని బి విజయ సారధి తెలిపారు ఈ సందర్భంగా మోడీ పతనం ఖాయమైందని ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో బీహార్ మధ్యప్రదేశ్లలో బిజెపి గోరంగా ఓడిపోయిందని స్వయంగా బిజెపి జాతి అధ్యక్షుడు పోటీ చేసిన స్థానంలో బిజెపి చిత్తుచిత్తుగా ఓడిపోయిందని రాబోతున్నటువంటి ఎన్నికల్లో బిజెపి పతనం ఖాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేందుకు దేశవ్యాప్తంగా ఆగస్టు 6 నుంచి 14వ తేదీ వరకు ప్రజా చైతన్య ప్రచార యాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల సామాన్య ప్రజలు, కార్మికులు, రైతులు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ ప్రచార యాత్ర ప్రధాన ఉద్దేశమని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రజలను చైతన్యపరిచి, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.తెలంగాణ సాయుధ పోరాట యోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందని తెలిపారు.ఈ ప్రచార యాత్రలో సీపీఐ మండల కార్యదర్శి బందు మహేందర్.నాయకులు సహాయ కార్యదర్శి గణపురం లక్ష్మణ్, పేరబోయిన కిరణ్ కుమార్, పట్టణ కార్యదర్శి ముద్రబోయిన వెంకన్న, శాఖ కార్యదర్శి వల్లపు వెంకన్న, దాసరి కృష్ణమూర్తి, వెంకన్న. సిపిఐ సీనియర్ నాయకులు మంగళపల్లి మల్లయ్య, చంద్రయ్య, వడ్లకొండ మల్లేష్‌లు కార్యకర్తలు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రజలకు అందుబాటులో ఉంటూ మన్ననలు పొందుతున్న

## కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దావెర అనిల్ కుమార్



**దేవరుప్పుల ఆగస్టు 10(జనం సాక్షి)** దేవరుప్పుల మండల నూతన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన దావెర అనిల్ కుమార్ పార్టీ శ్రేణులకు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. పదవి చేపట్టిన నాటి నుంచి పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్నారు.ఎవరికి ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే స్పందిస్తూ, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ కార్యకర్తలకు అండగా నిలుస్తున్నారు. పార్టీ కార్యక్రమాలను సమన్వయం చేస్తూ, గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నారు.ప్రజలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో సన్నిహితంగా మెలుగుతూ అందరికీ అందుబాటులో ఉండే నాయకుడిగా అనిల్ కుమార్ గుర్తింపు పొందుతున్నారు. ఆయన సేవా తీరుపై పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందిస్తున్నారు.

# మాజీ ఎమ్మెల్యే పెద్ది విగ్రహ గద్దె కూల్చివేత అమానుషం

**బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బాల్నె వెంకన్న**



**చెన్నారావుపేట, ఆగస్టు 1 (జనం సాక్షి):** నర్సంపేట అభివృద్ధి ప్రదాత, ఉద్యమ నేత, మాజీ శాసనసభ్యులు దివంగత పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహ గద్దె కూల్చివేత అమానుషం అని బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బాల్నె వెంకన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.దివంగత ఉద్యమ నేత, మాజీ శాసనసభ్యులు, ప్రజానేత పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహం ఏర్పాటు కోసం నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎదురుగా నిర్మించిన గద్దెను కూల్చి వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. నర్సంపేట నియోజకవర్గ ప్రజలకు సేవ చేసిన నాయకులు ఆయన జ్ఞాపకాలను గౌరవించడం ప్రజాస్వామ్య సంస్కృతిలో భాగమన్నారు. ప్రజల కోసం జీవితాంతం పనిచేసిన పెద్ది సుదర్శన్ రెడ్డి సేవలను గుర్తు చేసుకునేందుకు ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనుకోవడం తప్పా అని ప్రశ్నించారు.విగ్రహం ఏర్పాటు చేయడానికి గద్దె నిర్మించడమే నేరమా.. అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల మనోభావాలను గౌరవించకుండా గద్దెను కూల్చివేయాల్సినంత అత్యవసరం ఏమొచ్చిందని పెద్ది సుదర్శన్‌రెడ్డి నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి విశేషంగా కృషి చేసిన నాయకుడని ఆయన చేసిన సేవలను ప్రజలు ఎన్నటికీ మరిచిపోరని అన్నారు.ఒక గద్దెను కూల్చివేసినంత మాత్రాన పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రజాసేవ చరిత్రను కూల్చివేయగలరా.. ప్రజల గుండెల్లో ఆయనకున్న స్థానాన్ని చెరిపివేయగలరా.. అని ప్రశ్నించారు. అధికారులను అడ్డం పెట్టుకుని ప్రజల మనోభావాలను దెబ్బతీసే చర్యలకు పాల్పడటం మానుకోవాలని గద్దె కూల్చివేతపై అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన చేసిన అభివృద్ధి పనులు ప్రజల కోసం చేసిన పోరాటాలు పేదలు, రైతుల కోసం అందించిన సేవలు ప్రజల జ్ఞాపకాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. అధికారం ఎవరికి శాశ్వతం కాదని రానున్న రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.

# 12వ వేతన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలి

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** 12వ వేతన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సింగరేణి జీఎం కార్యాలయం ముందు సింగరేణి జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన మహా ధర్నాలో భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 12వ జాతీయ బొగ్గుగని కార్మికుల వేతన ఒప్పందాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చిందని, అవి కార్మికుల హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయని విమర్శించారు. ఈ నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బొగ్గు బ్లాకులను వేలం వేయడం వల్ల సింగరేణి సంస్థతో పాటు లక్షలాది మంది కార్మికుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని బొగ్గు బ్లాకులను వేలం ద్వారా కాకుండా నేరుగా సింగరేణి సంస్థకు కేటాయించాలని, కోయగూడెం ఓసీ-3 బొగ్గు గనిని కూడా సింగరేణికే అప్పగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అదే సమయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కార్మికుల హక్కులను పరిరక్షించాల్సిన కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా అమలులో ఉన్న కార్మిక చట్టాలను రద్దు చేసి తీసుకొచ్చిన లేబర్ కోడ్లు అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చేలా రూపొందించబడ్డాయని విమర్శించారు. సింగరేణి వంటి ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలకు ప్రాధాన్యం ఇస్తూ బొగ్గు బ్లాకులను వేలం వేస్తోందని అన్నారు. ఈ విధానం వల్ల ప్రభుత్వ రంగ సంస్థలు బలహీనపడటమే కాకుండా కార్మికుల ఉపాధి భద్రత కూడా ప్రశ్నార్థకంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులు, శ్రమ చట్టాలు, ట్రేడ్ యూనియన్ ఉద్యమాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. దేశ సంపదను కొద్దిమంది కార్పొరేట్ సంస్థల చేతుల్లో పెట్టే విధానాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. 12వ జాతీయ బొగ్గుగని కార్మికుల వేతన ఒప్పందాన్ని వెంటనే అమలు చేసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ మహా ధర్నాలో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్‌తో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మల్లన్న గండి ఎడమ కాలువ పనులు ప్రారంభించి రైతులకు సాగునీరు అందించాలి



**స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 10 ( జనం సాక్షి ) :** మల్లన్న గండి రిజర్వాయర్ నుండి ఎడమ కాలువ పనులు ప్రారంభించి వాటిని పూర్తి చేసి, రైతుల పంట పొలాలకు సాగునీరు అందించాలని గార్లగడ్డతండ, ఫతేపూర్, కృష్ణాజిగూడెం, పల్లగుట్ట, చిల్పూర్, రాజవరం తదితర గ్రామాల రైతులు కోరుతున్నారు కుడికాలువ కన్నా ముందే, ఎడమ కాల్వకు నిధులు మంజూరు అయ్యా అని గతంలో చెప్పినప్పటికీ నేటి వరకు పనులు ప్రారంభం కాకపోవడంతో సాగునీరు అందక ఇబ్బంది పడు తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవ తీసుకొని కుడికాలువ పనులు పూర్తి చేయించడంతో కుడి కాలువ కింద ఉన్న ఆయా గ్రామాల రైతుల పంట పొలాలకు ఆగు నీరు అంది ఆయా గ్రామాల రైతులు సంతోషంగా ఉన్నారని అన్నారు. ఇదంతా ఎమ్మెల్యే కడియం శ్రీహరి కృషివల్లే జరిగిందని రైతులు చెప్పుకుంటున్నారు. అదేవిధంగా ఎడమ కాలువ విషయంలో కూడా ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని మల్లన్న గండి రిజర్వాయ ర్ ద్వారా ఎడమ కానువ పనులు పూర్తిచేయించి సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు. అదేవిధంగా మల్లన్న గండి సమీపంలోని అబ్దుల్ నాగారం వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేసి పంట పొలాలకు సాగునీరు అందించాలని లింగంపల్లి, శ్రీపతి పెల్లి, కొండా పూర్, మల్యాపూర్, వెంకటాద్రి పేట గ్రామాల రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# చిన్నమాడూర్‌లో గ్రామసభ

**ఆరుతడి పంటలపై అవగాహన**

**జనగామ జిల్లా ఆగస్టు 1 (జనం సాక్షి):** దేవరుప్పుల మండలం చిన్నమాదూర్ గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరుతడి పంటల సాగుతో రైతులకు కలిగే ప్రయోజనాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే అర్హులైన వారు నూతనంగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సర్పంచ్ మైదం జోగేశ్వర్ సూచించారు.గ్రామ సమస్యలు, ప్రజల అవసరాలపై చర్చించి, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అధికారి భాస్కర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి శివారెడ్డి, ఉపసర్పంచ్ వెంకటేశ్వర్లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కోనాపురంలో పెద్దికి కొవ్వొత్తులతో ఘన నివాళి



**చెన్నారావుపేట, ఆగస్టు 10 ( జనం సాక్షి):** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డికి కొవ్వొత్తులతో ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం రాత్రి మండలంలోని కోనాపురం గ్రామంలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిత్రపటం వద్ద బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బాల్నె వెంకన్న, ఎన్నికల మండల కన్వీనర్ జక్కు అశోక్ లు స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలిసి కొవ్వొత్తులను వెలగించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మహా అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షులు కుండె మల్లయ్య, బిఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అనుముల కుమారస్వామి, ములుక సాంబయ్య కవి, గట్ల రాంబాబు, సూర రంజిత్, బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు ఇందూరి నర్సిరెడ్డి, అనుముల జనార్దన్, పున్నం నరసయ్య, బాణాపురం రాజు, బోనాల భద్రయ్య, చిలువేరు చిరంజీవి, నగేష్, రంజిత్, కుమారస్వామి, జన్ను దేవేందర్, పసునూటి జ్యోతి అనిల్, నవీన్, దోలె రష్యా, పరికి అనిల్, బుర్రి అనిల్, కన్నం అజయ్, తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డలకు అమృతంతో సమానం

**16 చింతల తండ గ్రామ సర్పంచ్ బానోతు విక్రమ్**



**చెన్నారావుపేట, ఆగస్టు 10( జనం సాక్షి):** తల్లిపాలు బిడ్డలకు అమృతంతో సమానమని 16 చింతల తండ గ్రామ సర్పంచ్ బానోతు విక్రమ్ అన్నారు. సోమవారం 16 చింతల తండా గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణీలు, తల్లులకు, చిన్నారులకు అవగాహన కల్పించారు. పుట్టిన గంటలోపే చిన్నారులకు ముర్రుపాలు తాగించాలని ముర్రుపాలు వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తుందన్నారు. అంగన్వాడి కేంద్రాలలో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ ఎల్. దేవి, ఆశా కార్యకర్త స్వరూప, వార్డు సభ్యులు రామోజీ, కేశ్య, అక్రి, రవి, మాలి, తల్లులు, గర్భిణీలు, చిన్నారులు, పాల్గొన్నారు.

## బిజెపి బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్**



**చెన్నారావుపేట, ఆగస్టు 10 ( జనం సాక్షి):** బిజెపి బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ అన్నారు. బిజెపి మండల అధ్యక్షులు దామెరుప్పుల శేఖర్ ఆధ్వర్యంలో చెన్నారావుపేట మండలంలోని లింగగిరి గ్రామానికి చెందిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి చీకటి వెంకన్న వరంగల్ జిల్లా బిజెపి అధ్యక్షులు గంట రవికుమార్ సమక్షంలో బిజెపి పార్టీలో చేరారు.ఆయనకు బిజెపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ నాయకత్వంలో బిజెపి చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై అనేకమంది బిజెపి పార్టీలో చేరుతున్నారని తెలిపారు.బిజెపి బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా బిజెపి జిల్లా కార్యదర్శి రామగౌని మహీధర్ గౌడ్ జన్మదిన వేడుకలు



**తాండూర్, ఆగస్టు 10(జనం సాక్షి )** బెల్లంపల్లిలో నియోజకవర్గం తాండూర్ మండలలో బీజేపీ సీనియర్ నాయకులు చిలువేరు శేషగిరి నివాసంలో బిజెపి జిల్లా కార్యదర్శి రామగౌని మహీధర్ గౌడ్ జన్మదిన వేడుకలు సోమవారం రోజున ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శాలువతో రామగౌని మహీధర్ గౌడ్ ని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు దుడపాక భరత్ కుమార్,జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు చిలుముల శ్రీకృష్ణదేవరాయలు,సీనియర్ నాయకులు తుకారం,జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్ధం మల్లేష్,మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్,మండల నాయకులు ఎలిగేటి నరేష్,ఆనంద్,వినోద్,స్కైలాబ్ తదితరులు పాల్గొన్నారు.

## చలి వాగు ప్రాజెక్టు నుండి రైతులకు వెంటనే సాగునీరు అందించాలి

### బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం విజయవంతం చేయండి

- మాజీ మండల అధ్యక్షుడు మనోహర్ రెడ్డి

**శాయంపేట, ఆగస్టు 10 ( జనం సాక్షి)** శాయంపేట మండలంలోని పెద్దకోడపాక చలి వగు ప్రాజెక్టు నుండి రైతులకు సాగునీరు అందించాలని బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 8:00 గంటలకు చెన్నాపూర్ క్రాస్ రోడ్ వద్ద భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి నాయకత్వంలో ధర్నా కార్యక్రమం నిర్వహించబడుతుందని మాజీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి తెలిపారు.రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది అనే సంకల్పంతో ప్రతి ఒక్కరూ ఐక్యంగా పాల్గొని రైతుల గొంతుకగా నిలవండి అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు, ప్రజలు , అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు.

## తిరంగా ర్యాలీని జయప్రదం చేయండి



**ఖానాపూర్ ఆగస్టు 10 (జనం సాక్షి)** ఈ నెల 13న నిర్వహించనున్న హర్ ఘర్ తిరంగా ర్యాలీని జయప్రదం చేయాలని బిజేపి శ్రేణులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. దేశ భక్తి, జాతీయ సమైక్యతను చాటి చెప్పే ఉద్దేశంతో ఈ ర్యాలీ నిర్వాస్తున్నామన్నారు. పట్టణంలోని ఎన్ టి ఆర్ చౌరస్తా నుండి తెలంగాణ తల్లి చౌరస్తా వరకు ఈ ర్యాలీ కొనసాగిందన్నారు. పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు పాల్గొని ర్యాలీని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కీర్తి మనోజ్ కుమార్, అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్, కౌన్సిలర్ బొప్పారపు సత్యవతి, పట్టణ ప్రధాన కార్యదర్శి రమేష్, నాయకులు బండిపెల్లి ప్రకాష్ గౌడ్, మదిరే శ్రీను, పడిగెల అశోక్, సుధాకర్, రవి, బత్తుల నారాయణ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## గుడిహత్నూర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు జన్మదిన వేడుకలు



**గుడిహత్నూర్, ఆగస్టు 10( జనం సాక్షి):** గుడిహత్నూర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తొడసం దౌలత్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి మంత్రి జూపల్లి కృష్ణారావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు అంకత్ రవి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగ్‌నాథ్ అప్ప, బాలాజీ పటేల్, వాషింఖాన్, ముండే యోగి, రోహిత్, ఆడే జైపాల్, కాగ్నే రాంకిషన్, సమీర్ తదితర మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై ఆందోళన

**తాండూర్,ఆగస్టు 10(జనం సాక్షి)** దేశవ్యాప్తంగా జరిగిన జైల్ బరో నిరాశన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం రోజున తాండూర్ తాసిల్దార్ ఆఫీస్ నుండి ఐబి చౌరస్తా వరకు కార్మికులు, వ్యవసాయ కార్మికులు ర్యాలీ నిర్వహించి జాతీయ రహదారిపై రాస్తారోకో చేయడం జరిగింది, ఈ సందర్భంగా దాగం రాజారాం సి ఐ .టీ .యూ మంచిర్యాల్ జిల్లా సహాయ కార్యదర్శి వేల్పుల శంకర్ వ్యవసాయ కార్మిక సంఘం తాండూరు మండల అధ్యక్షులు మాట్లాడుతూ ఈ జైలు బరో కార్యక్రమం ముఖ్య ఉద్దేశం కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, వ్యవసాయ కార్మికుల ప్రజా వ్యతిరేక విధానాలు, కార్పొరేట్ అనుకూల విధానాలను ఎండగడుతూ స్వాతంత్రం రాకముందు. స్వాతంత్రం వచ్చిన తర్వాత అనేక పోరాటాలు చేసి ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్నటువంటి 44 చట్టాలను రద్దుచేసి ఈ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ లను తీసుకువచ్చింది. ఈ నాలుగు లేబర్ కోడ్స్ కార్మికులకు అనేక ఇబ్బందులు కలిగించే విధంగా ఉన్నవి కాబట్టి ఈ నాలుగు లేబర్ కోడ్స్‌లను రద్దుచేసి ఎద విధంగా ఈ 44 చట్టాలను కొనసాగించాలి, గ్రామీణ ప్రాంతాలో కరువు కాలంలో వలసలను నివారించి వేలాదిమంది కుటుంబాలకు ఆర్థిక భరోసా నిచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విబిజీ రాంజీ చట్టం అమల్లోకి వచ్చింది కేంద్రం ఆర్భాటంగా ప్రకటిస్తున్నప్పటికీ ఈ నూతన చట్టం వల్ల జిల్లాల్లోని




ఉపాధి కూలీలకు తీవ్ర అన్యాయం జరగనుంది యధా విధంగా తిరిగి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి,ఆదివాసి గిరిజనులకు మరియు ఇతర కులాలు సాగు చేసుకున్నటువంటి సాగు భూములకు పట్టాలు ఇవ్వాలి పేదలను ఆదుకోవాలి,ఈ కార్యక్రమాలలో సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కార్మికులు లీలారాణి, సత్యవతి, కే విజయలక్ష్మి, ఎం విజయలక్ష్మి, శారద, లక్ష్మి, మగ్దూం, జైనేని రాజయ్య, బొల్లం రాజేశం, రెడ్డి మల్లక్క, వరలక్ష్మి, జేనేని లక్ష్మి, మరియు నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

## ఇండియా ఉద్యమస్ఫూర్తితో జైలు బరో జయప్రదం చేయండి

### స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు రద్దు చేయాలి

**చెన్నూర్ ఆగస్టు 10 (జనం సాక్షి )** చెన్నూరు మండల కేంద్రంలో సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జైల్ బరో కార్యక్రమం నిర్వహణలో భాగంగా రావి చెట్టు నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం బస్టాండ్ దగ్గర రాస్తారోకో చేయడం జరిగింది. ఈ సందర్భంగా బోడంకి చందు రైతు సంఘం జిల్లా కార్యదర్శి హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న ప్రజా, కార్మిక,రైతు వ్యతిరేక విధానాలు నశించాలని, స్వాతంత్ర ఉద్యమం కన్నా ముందు సాధించుకున్నా కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్ తీసుకువచ్చి కార్మికులకు కనీస హక్కులు లేకుండా చేస్తున్నారు. ప్రభుత్వ సంస్థలన్నీ ప్రైవేటుపరం చేస్తున్నారు, రైతుల విత్తన చట్టం, విద్యుత్ సవరణ చట్టాశీ రద్దు చేయాలని , మహాత్మ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కొనసాగించాలి, పంటలకు మద్దతు ధర కల్పించాలి, స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు రద్దు చేయాలి, వ్యవసాయాన్ని రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే పని మానుకోవాలి. మధ్యాహ్నం భోజనం,ఆశ కార్మికులకు కనీస వేతనం జీవో అమలు చేయాలి . కార్మికులకు పెండింగ్ బిల్లులు వేతనాలు చెల్లించాలి. ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని కల్పించి, రోజుకు 600 రూపాయలు ఇవ్వాలని , ఆదివాసులకు అటవీ హక్కు



చట్టం పటిష్టంగా అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్మ పున్నం ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి, కావేరి రవి సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు, శ్యామల ఉమారాణి మహిళా సంఘం జిల్లా కార్యదర్శి, కృష్ణమాచారి, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు, సరోజ, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు, కరింభీ మధ్యాహ్నం భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు, ఎర్రోళ్ల సంజీవ్ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు, ప్రజాసంఘాల నాయకులు చంద్రన్న,సమ్మక్క, మల్లికార్జున్,మదనక్క, గట్టక్క, దుర్గక్క, విజయలక్ష్మి, సెగ్గం భూషయ్య, రమేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రాస్తారోకో

**స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 10 ( జనం సాక్షి ) :** జైల్ భరో కార్యక్రమంలో భాగంగా సోమవారం ఘనపూర్ మండల కేంద్రంలోని సిపిఎం పార్టీ కార్యాలయం నుంచి గాంధీ చౌరస్తా వరకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించి, అనంతరం గాంధీచౌరస్తాలో రాస్తారోకో చేపట్టారు. సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్ర మంలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాసంఘాల నాయకులు లింగనబోయిన కుమార్, పోలాసు కిష్టయ్య, లింగనబోయిన శ్రీకాంత్, కత్తుల రాజు బాధ్యత వహించగా ముఖ్యఅతిథి గా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాపర్తి రాజు హాజరై మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్య ఉద్యమం లో బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా సాగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితోనే నేడు కేంద్ర ప్రభు త్వ ప్రజావ్యతిరేక విధానాలపైపోరాటం చేయాల్సి న అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల ప్రయోజనాల ను పట్టించుకోకుండా కార్పొరేట్ సంస్థలకు అను కూలమైన విధానాలను అమలు చేస్తోందని విమ ర్శించారు. కార్మికుల హక్కులను బలహీనపరిచే నాలుగు లేబర్ కోడ్ రద్దు చేయాలని కార్మిక చట్టాల్లో మార్పులు చేయడం, ఉద్యోగ భద్రతను దెబ్బతీయడం, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ వైపు నడిపించడం వంటి చర్యలు కార్మిక వర్గానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని అన్నారు.రైతులకు గిట్టుబాటు ధర, కేంద్ర ప్రభు త్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆరోపించారు. క్విట్



ఇండియా ఉద్యమం మనకు నేర్పిన పోరాట స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడే వరకు ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇర్రి అహల్య,భూక్యచందునాయక్, మునిగెల రమేష్, తోడెంగల ఐలయ్య, ఎడ్ల రాజు, గట్ల మల్లారెడ్డి మంద మహేందర్,చిలుముల్ల భాస్కర్,పోలాసు పరమేష్, మునిగే నరసింహులు, లింగనబోయిన రాజు, ఎదునూరి యాకయ్య, మేదరబోయిన కరుణాకర్,బైరపాక విజయ్, సింగపురం అనిల్, యం మల్లయ్య, వంగపండ్ల సోమయ్య,దాసరి కొమురయ్య,దైద కుమార్, గోడిశాల యాదగిరి, కొలిపాక వెంకటయ్య, తాటికొండ నాగరాజు, సారయ్య, గుర్రం మహేష్, గాదె బక్కయ్య , రైతులు వ్యవసాయ కూలీలు మున్సిపల్ జిపి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# జైనూర్ మార్కెట్ కమిటీలో ఘనంగా శ్రీకాంత్ జాదవ్ జన్మదిన వేడుకలు



**జైనూర్, ఆగస్టు 10(జనం సాక్షి)** జైనూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో సామాజిక సేవకులు, హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ అగ్రికల్చర్ డెవలప్మెంట్ (హెడ్) సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీకాంత్ జాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శ్రీకాంత్ జాదవ్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.సమాజానికి తనవంతు సేవ చేయాలనే సంకల్పంతో శ్రీకాంత్ జాదవ్ గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి రంగాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పలువురు కొనియాడారు. మారుమూల గిరిజన గ్రామాల్లో అవసరమైన సమయంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం, కంటి పరీక్షలు చేయించి అవసరమైన వారికి కంటి అద్దాలు అందించడం, విద్యార్థులకు పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్ అందించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు.అదేవిధంగా రైతులకు వ్యవసాయ నిపుణుల ద్వారా సలహాలు, సూచనలు అందిస్తూ అండగా నిలుస్తున్నారని, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలను తనవంతుగాఆదుకుంటున్నారని తెలిపారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించి మానవత్వాన్ని చాటుకున్నారని గుర్తు చేశారు. వర్షాకాలంలో మారుమూల గ్రామాలకు రాకపోకలు ఇబ్బందికరంగా మారినప్పుడు తన సొంత ఖర్చులతో రహదారి మరమ్మతులు చేయించడం అభినందనీయమన్నారు.మానవ సేవే మాధవ సేవ" అనే భావనతో నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ గిరిజన ప్రాంత ప్రజలకు అండగా నిలుస్తున్న శ్రీకాంత్ జాదవ్ మరింత సేవ చేయాలని పలువురు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కె. విశ్వనాథ్, మాజీ గ్రంథాలయ చైర్మన్ కనగ యదవ్ అంబాజీ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, హెడ్,సొసైటీ సభ్యులు, అభిమానులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొని శ్రీకాంత్ జాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా శ్రీకాంత్ జాదవ్ మాట్లాడుతూ తనపై అభిమానంతో జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ గిరిజన ప్రాంత ప్రజలకు తనవంతు సేవలను కొనసాగిస్తానని పేర్కొన్నారు.

# నిర్మాణం పూర్తికాకముందే ఇంటి పన్ను రసీదు ఎలా జారీ చేశారు?

- గూడూరు గ్రామ పంచాయతీలో నిబంధనల ఉల్లంఘనలపై సమగ్ర విచారణ జరపాలి
- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కాయితోజు దేవేంద్రచారి





**మహబూబాబాద్ ప్రతినిధి, ఆగస్టు 10 (జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లా గూడూరు గ్రామపంచాయతీ పరిధిలో ఇంటి నిర్మాణ అనుమతులు, పన్ను రసీదు జారీ విషయంలో నిబంధనలు పాటించలేదన్న ఆరోపణలు వెలువడుతున్నాయి. ఆంధ్రాబ్యాంక్ వెనుక ఏపూరు మహేష్ చంద్రారెడ్డి తండ్రి రవీందర్‌రెడ్డి చేపడుతున్న ఇంటి నిర్మాణానికి సంబంధించి నిర్మాణం పూర్తికాకముందే ఇంటి పన్ను రసీదు ఎలా జారీ చేశారనే అంశంపై సమగ్ర విచారణ జరపాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కాయితోజు దేవేంద్రచారి డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణం ప్రారంభ దశలోనే నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణానికి అనుమతులు ఇవ్వవద్దని గూడూరు పంచాయతీ కార్యదర్శికి గతంలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ, నిర్మాణం పూర్తికాకముందే ఇంటి పన్ను రసీదు జారీ చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని దేవేంద్రచారి తెలిపారు. అసలు నిర్మాణం ఏ దశలో ఉన్న సమయంలో పన్ను రసీదు జారీ చేశారు? ఏ దరఖాస్తు, ఏ పరిశీలన, ఏ పంచాయతీ రికార్డు ఆధారంగా రసీదు ఇచ్చారు? అనే విషయాలను అధికారులు స్పష్టం చేయాలని కోరారు.

## గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించాలి:

సదరు ఇంటి నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, దరఖాస్తులు, పంచాయతీ తీర్మానాలు, ఫైల్ నోట్లు, క్షేత్రస్థాయి పరిశీలన నివేదికలు, పన్ను రసీదు జారీ వివరాలు తదితర రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించాలని దేవేంద్రచారి కోరారు. పన్ను రసీదు జారీ చేసిన తేదీ నాటికి నిర్మాణం వాస్తవంగా ఏ దశలో ఉందో అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి వాస్తవాలను నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు.

## ఏజెన్సీ చట్టాలపైనా అధికారులు దృష్టి సారించాలి:

సదరు నిర్మాణ ప్రాంతం ఏజెన్సీ పరిధిలోకి వస్తే, వర్తించే 1/70 నిబంధనలు, పీసా చట్టం, భూ బదలాయింపు నిబంధనలు, ఇతర సంబంధిత చట్టాలను అధికారులు పరిశీలించాలని ఆయన కోరారు. నిర్మాణానికి సంబంధించిన భూమి హక్కులు, వినియోగం, అనుమతులు, బదలాయింపులు తదితర అంశాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

గతంలో కొంతమంది గిరిజన నాయకులు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోలేదని దేవేంద్రచారి ఆరోపించారు. ఫిర్యాదులపై ఎందుకు చర్యలు తీసుకోలేదనే అంశంపైనా విచారణ జరిపి, నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## గూడూరులో అక్రమ రియల్ ఎస్టేట్ కార్యకలాపాలపై విచారణ చేయాలి

గిరిజనుల పేరును ఉపయోగించుకుంటూ కొంతమంది వ్యక్తులు అక్రమ రియల్ ఎస్టేట్ కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయని దేవేంద్రచారి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ, అసైన్డ్ భూముల ఆక్రమణలు, వెంచర్ల ఏర్పాటు, భూముల మరమ్మతులు, నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లుగా విభజించి విక్రయాలు జరుపుతున్నారనే ఆరోపణలపై కూడా సంబంధిత శాఖలు సమగ్రంగా దర్యాప్తు చేయాలని కోరారు. అయితే ఆయా ఆరోపణలపై అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉందని, ఎలాంటి వ్యక్తుల ప్రభావానికీ లోనుకాకుండా అధికారులు నిష్పాక్షికంగా విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆయన అన్నారు.

## జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

ఇంటి పన్ను రసీదు జారీ, నిర్మాణ అనుమతులు, పంచాయతీ రికార్డులు, భూమి హక్కులు, ఏజెన్సీ చట్టాల అమలు తదితర అంశాలపై పూర్తి స్థాయి విచారణ కోరుతూ మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు దేవేంద్రచారి తెలిపారు. విచారణలో నిబంధనలకు విరుద్ధంగా పన్ను రసీదు లేదా నిర్మాణ అనుమతులు జారీ చేసినట్లు తేలితే సంబంధిత అధికారులు, సిబ్బందిపై శాఖాపరమైన, అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విచారణను పారదర్శకంగా నిర్వహించి, వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు.

# బెల్ట్ షాపులు తక్షణమే మూసివేయాలి

**యువత భవిష్యత్‌ను నాశనం చేస్తున్న మద్యం విక్రయాలపై చర్యలు తీసుకోవాలి**



**కాళేశ్వరం , ఆగస్టు 10 , ( జనం సాక్షి)** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం గ్రామంలో విచ్చలవిడిగా కొనసాగుతున్న బెల్ట్ షాపులను తక్షణమే మూసివేయాలని ఎమ్మార్పీఎస్ గ్రామ ప్రధాన కార్యదర్శి లేతకారి రాజశేఖర్ డిమాండ్ చేశారు.గ్రామంలో 24 గంటలు మద్యం అందుబాటులో ఉండటంతో యువత చెడు వ్యసనాలకు బానిసలై తమ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపులపై పోలీసులు, ఎక్సైజ్ అధికారులు వెంటనే దాడులు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.కాళేశ్వరం-మహాదేవపూర్ రహదారిలోని కొన్ని బెల్ట్ షాపుల్లో కల్తీ మద్యం, గుడుంబా విక్రయిస్తున్నారనే ఆరోపణలపై కూడా అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే బెల్ట్ షాపులపై ప్రజలతో కలిసి ఆందోళన చేపడతామని లేతకారి రాజశేఖర్ హెచ్చరించారు.

# అక్రమ ఇసుక డంపులు సీజ్..నేడు బహిరంగ వేలం

**దేవరుప్పుల, ఆగస్టు 10 (జనం సాక్షి):** తహసీల్దార్ ఆదేశాల మేరకు దేవరుప్పుల రెవెన్యూ గ్రామ పరిధిలో సోమవారం మధ్యాహ్నం రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్రమంగా నిల్వ చేసిన ఏడు ఇసుక డంపులను గుర్తించి సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు.సీజ్ చేసిన ఇసుకను నేడు ఉదయం 11:30 గంటలకు బహిరంగ వేలం వేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఇసుకను కొనుగోలు చేయడానికి ఆసక్తి ఉన్న వ్యక్తులు, వాహనదారులు వేలంలో పాల్గొని ఇసుకను దక్కించుకోవాలని ఆయన సూచించారు. వేలం ప్రక్రియ నిబంధనల ప్రకారం నిర్వహించనున్నట్లు తెలిపారు.

# సిఐటియు రైతు సంఘం ,

## వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జైల్ బరో కార్యక్రమం

### స్వల్ప ఉద్రిక్తత ఉద్యమ నాయకుల అరెస్ట్



**తొర్రూరు ,ఆగస్టు 9 (జనం సాక్షి):** తొర్రూరు మండలం కేంద్రం లో బస్టాండ్ సెంటర్లో సిఐటియు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జైల్ బరో నిరసన కార్యక్రమం జరిగింది. రోడ్డుపై ధర్నా చేస్తున్న ఉద్యమకారులకు , పోలీసులకు మధ్య తోపులాటతో స్వల్ప ఉద్రిక్తత వాతావరణం చోట్ను చేసుకుంది అనంతరం అనంతరం ఉద్యమ నాయకులను అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య, రైతు సంఘం జిల్లా నాయకులు బొల్లం అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎండి యాకూబ్ సిఐటియు మండల కన్వీనర్ జమ్ముల శ్రీను అంగన్వాడి యూనియన్ తొర్రూరు ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు శైలజ, పసుల స్వరూప, వ్యవసాయ కార్మిక సంఘం పెద్దవంగర మండల కార్యదర్శి కసర బోయిన ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షురాలు అందే మంజుల, రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు సోమిరెడ్డి, కొత్త వెంకట్ రెడ్డి, దోనక దర్గయ్య తిమ్మిడి రవి కంటాయపాలెం గ్రామ ఉపసర్పంచ్ జితేందర్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఎండి అమీర్ , భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు పల్లె వెంకటేశ్వర్లు, తాళ్ల వెంకటేశ్వర్లు ఉమా గాని యాకయ్య, రాధా, రామకృష్ణ, షమీనా, భాగ్య, శ్రీలత ,యాకమ్మ, వరలక్ష్మి నాగమణి , అమీనా, పల్లె పద్మ, వసంత, శోభన్ ,సోమన్న, తదితరులు పాల్గొన్నారు.

# బుద్ధ విహార్ అభివృద్ధికి కృషి చేస్తా

**మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేశ్**



**నిర్మల్ ఆగస్టు 10, (జనంసాక్షి):** బుద్ధ విహార్ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ ఛాంబర్‌లో బుద్ధ విహార్ కమిటీ నాయకులు ఆయనను కలిసి అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ చక్రవర్తి మాట్లాడుతూ సంబంధిత సమస్యలను పరిశీలించి పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో బుద్ధ విహార్ కమిటీ అధ్యక్షుడు కుంటొల్ల వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి మధుకర్ మునేశ్వర్, గౌరవ సలహాదారులు సుదర్శన్ బౌద్ధ్, దేవుళ్ల గంగాధర్, జాడే భీమ్‌రావు, కాంగ్రెస్ నాయకుడు మూడుసు సత్యనారాయణ, భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు కొంతం మురళీధర్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఈరోల పురుషోత్తం, కౌన్సిలర్లు కత్తి నరేందర్, నల్లూరి పోశెట్టి, కార్యవర్గ సభ్యులు భగత్ నారాయణ, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబని పరామర్శించిన
# మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



**పెద్దవంగర ఆగస్టు 10(జనం సాక్షి )** బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. సోమవారం మండలంలో అవుతాపురం గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ సెక్రటరీ చిలుకమారి సత్తయ్య, ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని, దహనసంస్కారల్లో పాల్గొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన రాష్ట్ర మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుని కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు.వారి వెంట పార్టీ నాయకులు, ఈదురు ఐలయ్య, శ్రీరాం సుధీర్, సల్లండి సుధాకర్, కృష్ణమూర్తి,కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# ‘హర్ ఘర్ తిరంగా’ను ఘనంగా నిర్వహించాలి

### జోనల్ కన్వీనర్ రావుల రాంనాథ్



**నిర్మల్ టౌన్ , ఆగష్టు 10, (జనంసాక్షి)** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నేటి నుంచి 15 వరకు ఘనంగా నిర్వహించాలని బీజేపీ సీనియర్ నాయకులు, జోనల్ కన్వీనర్ రావుల రాంనాథ్ పిలుపునిచ్చారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, దుకాణాల వద్ద త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించాలని కోరారు. సామాజిక మాధ్యమాల ప్రొఫైల్ చిత్రంగా జాతీయ జెండాను పెట్టుకోవాలని సూచించారు. ఈ నెల 13న నిర్మల్ జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ర్యాలీకి బీజేపీ శాసనసభాపక్ష నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు సుంకరి సాయి, కౌన్సిలర్లు, జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాలకుర్తిలో ప్రజా సంఘాల ధర్నా, రాస్తారోకో



**పాలకుర్తి, ఆగస్టు 10(జనంసాక్షి)** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు విధానాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాల పిలుపు మేరకు సోమవారం జైలు భరో కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో సీఐటీయు, రైతు సంఘం. వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకుర్తి హనుమకొండ రోడ్డు మార్గంలో సుమారు గంటసేపు ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిట్యాల సోమన్న, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాచర్ల సారయ్య మాట్లాడుతూ బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకం గానిర్వహించిన క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తితోనే కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు జైలు భరో కార్యక్రమానికి పిలుపు ఇచ్చినట్లు తెలిపారు ఈ కార్యక్రమం లో నాయకులు సోమ సత్యం, కాకర్ల బాబు, నాగయ్య, ముస్కు ఇంద్రారెడ్డి, పెంతల బిక్షం, తోటకూరి నర్సయ్య, మల్లేష్, సమ్మయ్య, పద్మ, ఎల్లమ్మ, యాదమ్మ, యాకమ్మ, వెంకన్న, రజిత తదితరులు పాల్గొన్నారు.

# క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో జైల్ భరో విజయవంతం చేయండి

### సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అబ్బోజు రమణ డిమాండ్



బెల్లంపల్లి, ఆగస్టు10, (జనంసాక్షి ). కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను మరింత వేగంగా అమలు చేస్తోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అబ్బోజు రమణ అన్నారు. సోమవారం సీఐటీయూ చేపట్టిన జైల్ భరో కార్యక్రమం బెల్లంపల్లి లో విజయవంతమైంది. జైల్ భరో కార్యక్రమంలో భాగంగా బెల్లంపల్లి తిలక్ స్టేడియం నుండి మార్కెట్ అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అబ్బోజు రమణ మాట్లాడుతూ స్వాతంత్ర్యాన్ని విదేశీ సంస్థలకు తాకట్టు పెట్టే విధానాలను కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తోందని విమర్శించారు. నాడు బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం సాగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్పొరేట్ పెట్టుబడిదారులు, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో భారతదేశాన్ని, కార్మికుల హక్కులను కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గోమాస అశోక్, సీఐటీయూ జిల్లా కమిటీ నాయకుడు చల్లూరి దేవదాస్, అంగన్వాడీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భానుమతి, రాజమణి, ఆశా జిల్లా అధ్యక్షురాలు సమ్మక్క, భాగ్యలక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ దాగం శ్రీకాంత్, మధ్యాహ్న భోజన జిల్లా కమిటీ సభ్యురాలు పి రమాదేవి, తెలంగాణ మున్సిపాలిటీ వర్కర్స్ జిల్లా అధ్యక్షులు యాకూబ్, మున్సిపల్ కార్మికులు సుమన్, ప్రభాకర్, భగత్, వెంకటేష్, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు, నెన్నెల, భీమిని, కన్నెపల్లి, బెల్లంపల్లి మండలాల నాయకులు, కార్మికులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

# హక్కుల కోసం రోడ్డెక్కిన కార్మిక, కర్షక జనం




**నూగూర్ వెంకటాపురం ఆగస్టు 10(జనం సాక్షి ):-** వెంకటాపురం మండల కేంద్రంలో కార్మిక కర్షక హక్కులను పరిరక్షణకై సోమవారం సిఐటియు,ఏఐవి డబ్ల్యూ యు , ఏఐకెఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం నాడు భారీ ర్యాలీ నిర్వహించారు .మార్కెట్ యార్డ్ నుండి సినిమా హాల్ మీదుగా అంబేద్కర్ సెంటర్ బస్టాండ్ మీదుగా ఎన్టీఆర్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. మూడు కిలోమీటర్లు పైగా జరిగిన ర్యాలీలో క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఉద్యమిద్దాం... హక్కులను పరిరక్షించుకుందాం కార్మికుల కోసం దేశ సంపదను దోచిపెడుతున్న కార్పొరేట్లకు వ్యతిరేకంగా పోరాడుదాం.. అంటూ కార్యకర్తల నినాదాలు చేశారు. ఎన్టీఆర్ సెంటర్లో జరిగిన ధర్నాను ఉద్దేశించి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గ్యానం వాసు మాట్లాడుతూ ... కార్మికులును హరించే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు పరచాలని, కార్మికులకు కనీస వేతనం 26000 ఇవ్వాలని, వీబీజీ రాంజీ బిల్లును రద్దు చేయాలనిఅన్నారు.ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ ఆపాలని, స్కీమ్ వర్కర్లకు పర్మినెంట్ చేయాలని పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలు రాస్తే సహించే ప్రసక్తే లేదని హక్కులు కల్పించేంతవరకు పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రైతులకు గిట్టుబాటు ధర అన్ని పంటలు కల్పించాలని, కేంద్ర విద్యుత్ సవరణ బిల్లు 2025 వెంటనే రద్దు పరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు, రైతు సంఘం జిల్లా నాయకులు కుమ్మరి శీను, కట్ల నరసింహాచారి, చిట్టెం ఆదినారాయణ వివిధ ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు దేవి సుహాసిని నిర్మల బ్రహ్మం జే సీను రంజిత్ రాంప్రసాద్ సుధాకర్ రాజు మంగ వేణి మల్లక్క సుహాసిని ఎన్వి వెంకటరమణ సడలు పి రత్నకుమారి శశింతల సత్యవతి పి శ్రీను కే వెంకట నర్సయ్య, కురుసం మల్లయ్య, పి కృష్ణ సోలం రంగయ్య, కోట నాగేశ్వరరావు, కాపుల వెంకటేశ్వర్లు, బి సాంబి విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### నూతన సమీకృత కలెక్టరేట్ భవనాన్ని
# పైలాన్ నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ములుగు ప్రతినిధి, ఆగష్టు 10(జనంసాక్షి).** నూతన సమీకృత కలెక్టరేట్ భవనాన్ని, పైలాన్ నిర్మాణ పనులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క పరిశీలించారు. సోమవారం మంత్రి అనసూయ సీతక్క నూతన కలెక్టరేట్ కార్యాలయం, ఘట్టమ్మ వద్ద నిర్మిస్తున్న పైలాన్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పైలాన్ నిర్మాణ పురోగతిని పరిశీలించిన మంత్రి అనసూయ సీతక్క పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. నూతన కలెక్టరేట్ ప్రాంగణంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, పార్కింగ్, విద్యుత్ సౌకర్యాలు, తాగునీటి ఏర్పాట్లు, పరిశుభ్రత తదితర అంశాలపై ఆరా తీశారు సందర్శకులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, ములుగు తహసిల్దార్ విజయభాస్కర్, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# సామ్రాజ్యవాద శక్తులకు భయపడుతున్న కేంద్ర బిజెపి ప్రభుత్వం

- సిఐటియు ఏఐకేఎస్ రైతు సంఘం
- వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా రాస్తారోకో



**బచ్చన్నపేట ఆగస్టు 10 ( జనం సాక్షి):** కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం సామ్రాజ్యవాద శక్తులకు భయపడి పనిచేస్తుందని సిఐటియు. ఏఐకేఎస్ . వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు అన్నబోయిన రాజు. భైరగొని అంజుమ్. తాడెం రాములు అన్నారు. సోమవారం బచ్చన్నపేట మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా భారీ ధర్నా రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక రైతు వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలు కార్పొరేట్ అనుకూల నిర్ణయాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. కేంద్రంలో బిజెపి మోడీ ప్రభుత్వం సామ్రాజ్యవాద శక్తులకు లొంగిపోయి అమెరికా నుంచి ఇతర దేశాల నుంచి 30 రకాల జీరో తారీఫ్ లతో అనేక రకాల వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటుందని ఈ ఒప్పందాల వల్ల దేశ రైతాంగం కార్మిక వర్గం వ్యవసాయ కార్మికుల ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలుగుతుందని విమర్శించారు. ఇది భారత వ్యవసాయాన్ని కార్పోరేట్ శక్తులకు అప్పగించేందుకు భాగమేనని వారు విమర్శించారు. ఇలాంటి విధానాలను వెంటనే ఉపసంహరించుకోకపోతే రైతులు కార్మికులు వ్యవసాయ కూలీల ఆగ్రహానికి కేంద్ర ప్రభుత్వం గురికావాల్సి వస్తుంది అని హెచ్చరించారు. కార్మికులు దశాబ్దాల పోరాటంతో సాధించుకున్న 29 రకాల చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చి కార్మికుల పొట్ట కొడుతుందని గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరుస్తూ విబిజి రాంజీ పేరుతో కొత్త పథకాన్ని తీసుకురావడం గ్రామీణ వ్యవసాయ కూలీల పొట్ట కొట్టడమే దీని ఉద్దేశం అన్నారు. కొత్త చట్టాన్ని తీసుకురడం వల్ల వ్యవసాయ కూలీల జీవనోపాధిపై దెబ్బ పడుతుందని అని ఆవేదన వ్యక్తపరిచారు.దేశ సంపదను వనరులను కార్పోరేట్ సంస్థలకు అప్పగిస్తున్న కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేటుకరించే ప్రయత్నం చేస్తుందని రైతులు కార్మికులు వ్యవసాయ కూలీల హక్కులను కాలరస్తూ కార్పొరేట్ సంస్థల లాభాల కోసమే కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని దాని ఫలితంగానే నిత్యవసరవస్తుల ధరలు రోజు పెరుగుతున్నాయని అన్నారు.ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రైతులు కార్మికులు వ్యవసాయ కూలీలు ఐక్యంగా పెద్ద ఎత్తున భవిష్యత్తులో ఆందోళనపోరాటాలు ఉద్యమాలు చేస్తానని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిఐటియు తెలంగాణ రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం ప్రజాసంఘాల నాయకులు బండ కింది బాల నారాయణ.బైరగోని బలరాములు. మిన్నలాపురం ఎల్లయ్య. ఎడబోయిన రవీందర్ రెడ్డి.మన్నే లక్ష్మి.కల్పన.ఇంజ ఎల్లయ్య .రామగల అశోక్.బడంగల్ బలరాములు. కర్రే రాములు.కాంట్రాజు కృష్ణ.బత్తుల చంద్రం. జేరిపోతుల ఇంద్ర. కవిత. లక్ష్మి. ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మేడారం ఆలయ తుది దశ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

## మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ఎస్ ఎస్ తాడ్వాయి,ఆగస్టు 10(జనంసాక్షి).** మేడారం ఆలయంలో చేపట్టిన తుది దశ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. సోమవారం తాడ్వాయి మండలం మేడారంలోని శ్రీ సమ్మక్క--సారలమ్మ వనదేవతలను మంత్రి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి, వనదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో మేడారంలో చేపడుతున్న ఏర్పాట్లను, ఆలయ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలో కొనసాగుతున్న పీటీ బీమ్స్, క్యూ లైన్లు, మీడియా టవర్లు, గ్రానైట్ పనులను పరిశీలించిన మంత్రి, వాటి పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆలయ ప్రాంగణం వెనుక భాగంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న క్యూ లైన్‌కు సంబంధించిన స్థలాన్ని పరిశీలించి, భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఈవో కార్యాలయ పరిసరాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి 16వ తేదీన పర్యటించనున్న సందర్భంగా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను అధికారులు సమర్థవంతంగా నిర్వర్తించాలని, క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జీ, సంపత్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, డీపీఓ వెంకయ్య, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, ఆలయ ఈవో, సంబంధిత జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి మహిళా మోర్చా ఆధ్వర్యంలో వినూత్న నిరసన



**మంచిర్యాల ప్రతినిధి, ఆగస్టు 10, జనంసాక్షి** మంచిర్యాల పట్టణంలోని హైటెక్ సిటీ రోడ్ల దయనీయ పరిస్థితి పై సోమవారం నాడు బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో హైటెక్ సిటీ రోడ్ల పై వరి నాట్లు వేసి వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిళా మోర్చా అధ్యక్షురాలు పచ్చ స్వప్న రాణి మాట్లాడుతూ... దీ=ూ ప్రభుత్వం ఉన్న సమయంలో అప్పుడు డీసీసీ అధ్యక్షరాలుగా ఉన్న కొక్కిరాల సురేఖ హైటెక్ సిటీ రోడ్ల బాగు చేయాలని నాట్లు వేసి నిరసన తెలిపారు. మరి ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు అవుతున్న ఇప్పటి వరకు హైటెక్ సిటీ లో ఒక్క రోడ్డు కూడా వేయలేదని అన్నారు. హైటెక్ సిటీలో రోడ్ల పరిస్థితి దయనీయంగా ఉందని చిన్న వర్షానికి రోడ్లపై వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉందని తెలిపారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు తక్షణమే స్పందించి హైటెక్ సిటీలో రోడ్ల నిర్మాణం వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పచ్చ స్వప్న రాణి, కొండవీటి తిరుమల, భైరం లక్ష్మీ, తూటి సరస్వతి, జిట్టవేణి రేణుక, దాసరి పద్మ, సృజన, సుకన్య, వీణ మరియు తతిదరుల పాల్గొన్నారు.

# పేద కుటుంబానికి రూ.5 లక్షల ఎల్‌ఓసీ అందజేత



**చెన్నూర్ ఆగస్టు 10 (జనం సాక్షి )** మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గ కేంద్రానికి చెందిన నెన్నెల చిన్న రాజం మెదడులో రక్తం గడ్డకట్టడంతో అనారోగ్యానికి గురయ్యారు. ఆయన కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు విషయాన్ని మంత్రి వివేక్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి బాధితుడి వైద్య చికిత్స కోసం రూ.5 లక్షల విలువైన ఎల్‌ఓసీని మంజూరు చేశారు. ఈ మేరకు సోమవారం చెన్నూరులోని క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీ చెక్కును అందజేశారు. తమ కుటుంబానికి వైద్య సాయం అందేలా చర్యలు తీసుకున్న మంత్రికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# నిర్మల్‌లో ప్రైమ్ ల్యాబ్ క్లినికల్ లాబొరేటరీ ప్రారంభం



**నిర్మల్ బ్యూరో, ఆగస్టు 10,( జనంసాక్షి):** పట్టణంలోని ఎలక్ట్రిసిటీ కార్యాలయం ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన ప్రైమ్ ల్యాబ్ క్లినికల్ లాబొరేటరీని మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ల్యాబొరేటరీ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్య పరీక్షలు అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. ల్యాబొరేటరీ ద్వారా పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జకి, గోపు గోపీ, ఎస్పీ రాజు, ఇమ్రానుల్లా, రఫీ, జాకీర్, కత్తి నరేందర్, ఇర్ఫాన్, సాకీర్‌తో పాటు అజార్‌సాబ్, అమీర్‌సాబ్, హస్మాత్, బాదర్, యూనుస్, అషు, అల్తాఫ్, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# గీత కార్మికులకు టీ షర్టు పంపిణీ



**పెద్దవంగర ఆగష్టు10(జనం సాక్షి )** బానోత్ బిక్షం నాయక్ జ్ఞాపకార్ధంగా తన కుమారుడైన బానోత్ సురేందర్ నాయక్ తన సొంత డబ్బులతో సోమవారం మండలంలో తన సగ్రామమైన పోచారం గ్రామంలో గౌడ్ అన్నలకు తాటి, ఈత చెట్లు ఎక్కేటప్పుడు రక్షణ కోసం, టీ షర్టను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సీతారాం నాయక్ , మద్దెల యాకయ్య, సారయ్య,వెంకన్న, మహేందర్,తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన రమేష్ బాబు

**గూడూరు,ఆగస్టు10(జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లా గూడూరు ఎస్ఐగా పని చేసిన బి.గిరిధర్ రెడ్డి బదిలీపై వెళ్లడంతో వారి స్థానంలో నూతన ఎస్ఐగా రమేష్ బాబు సోమవారం తమ పదవి బాధ్యతలను చేపట్టారు.ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ , శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు.



## కాంగ్రెస్ వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరిన రాపాక బ్రహ్మచారి

### ఆహ్వానించిన బిఆర్ఎస్ ములుగు ఇంచార్జి బడే నాగజ్యోతి



**కొత్తగూడ ఆగస్టు 10 జనంసాక్షి** :మహబూబాబాద్ జిల్లా, ములుగు నియోజకవర్గం కొత్తగూడ మండలం ఓటాయి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు,విశ్వబ్రాహ్మణ మండల ప్రధాన కార్యదర్శి రాపాక బ్రహ్మచారి బీఆర్ఎస్ పార్టీలో చేరారు.బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి ఆయనకు కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి, రైతు సంక్షేమ పాలనను ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని, ఈ చేరికతో కొత్తగూడ మండలంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని బడే నాగజ్యోతి తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు కొమ్మనబోయిన వేణు యాదవ్,జిల్లా నాయకులు జగదీష్, నెహ్రూ నాయక్, ఈసం స్వామి, అజ్మీరా రమేష్ గ్రామ నాయకులు బుగ్గల కొమురయ్య, చింత అనిల్, దయ్యాల నరేష్, కూడికల రమేష్, ఏషబోయిన త్యాగరాజు, బొల్ల అనిల్ యాదవ్, కొమరం సిద్దు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో అవుట్ సోర్సింగ్ కార్మికుడు మృతి



**పెంచికల్ పేట్ ఆగస్టు 10,(జనంసాక్షి )**, మండలంలోని సబ్‌స్టేషన్ లో అవుట్ సోర్సింగ్ కార్మికునిగా, బొంబాయి గూడ గ్రామానికి చెందిన, నాగపురి. చందు వయస్సు 35, సోమవారం రోజున ఉదయం 9గంటల ప్రాంతంలో, పోతేపల్లి గ్రామపంచాయితీలోని మొట్లగూడ, గోంట్లపేట బస్ స్టాండ్ ఎదురుగ కరెంట్ పనులు చేస్తుండగా, ఒక్కరిగా షాక్ తగలడంతో కిందపడి పోయదని అక్కడున్న స్థానికులు అతన్ని హుటాహుటిన ప్రవేటు ఆసుపత్రికి తీసుకొని వెళ్లేసరికి అప్పటికే అయన మృతి చెందడని వైద్యులు తెలిపారు . పోస్ట్ మాస్టమ్ కోసం శవాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకోని, వెళ్లడం జరిగిందని ఏస్. ఐ అనిల్ కుమార్ అన్నారు.అతనికి భార్య ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని, రెక్కా డితే కానీ డొక్కా నిండని బీదకుటుంబమని,అన్నారు. కుటుంబికుల ఏడుపులు అక్కడున్న వారిని కంట తడి పెట్టేలా చేశాయని, నాన్నలే, ఒక్కసారి మాతో మాట్లాడు అంటూ ఆ చిన్నారుల మాటలకూ, హృదయాలను హత్తు కునేలా చేశాయని అన్నారు. అతని కుటుంబానికి భరోసాగా విద్యుత్ శాఖ నుండి 25,లక్షల రూపాయలు, కుటుంబం నుండి ఒకరికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

## కుంటాల జిల్లా సర్పంచుల సంఘం నూతన కార్యవర్గానికి ఘన సన్మానం



**కుంటాల, ఆగస్టు 10(జనం సాక్షి)**: కుంటాల మండల సర్పంచ్ జక్కుల గజేందర్ గారు జిల్లా సర్పంచుల సంఘం గౌరవ అధ్యక్షులుగా, అలాగే కల్లూర్ సర్పంచ్ పెంటవార్ దశరథ్ గారు జిల్లా సర్పంచుల సంఘం ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా కుంటాల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు నాలం శ్రీనివాస్ గారు వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు.అనంతరం వారికి పుష్పగుచ్ఛం అందించి, ప్రత్యేక అభినందనలు మరియు భవిష్యత్తు విజయాలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రముఖులు పాల్గొన్నారు.

## అంగన్వాడి భవనాలు ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు



**మహా ముత్తారం ఆగస్టు 10 (జనం సాక్షి)** అంగన్వాడి భవనాలు మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. సోమవారం మండల కేంద్రంలో, రెండు అంగన్వాడీ భవనాలు, మరియు, ములుగు పల్లి, దుంపిలపల్లి,గ్రామంలో నూతనంగా నిర్మించిన రెండు అంగన్వాడీ కేంద్రాలను మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు చేతుల మీదుగా ప్రారంభించారు, ఒక్కో భవనానికి, రూ. 16 లక్షల వ్యాయామంతో నిర్మించారు, ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి మండల అభివృద్ధి అధికారి ప్రకాష్ రెడ్డి,తహసిల్దార్ శ్రీనివాస్, సిడిపిఓ రాధిక, స్థానిక సర్పంచులు అధికారులు ప్రజాప్రతినిధులు.. అంగన్వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

### ఈ నెల 17న జరిగే బస్సు యాత్రను విజయవంతం చేయాలి



**మంగపేట ఆగస్టు 10 జనంసాక్షి** : ఏజెన్సీ కల్లుగీత కార్మికుల సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి అని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గాజుల ఈశ్వర్, జిల్లా నాయకులు నక్క యాకయ్య, మండలశాఖ అధ్యక్షుడు రావుల శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని బుచ్చంపేట గ్రామంలో కల్లుగీత కార్మికుల సంఘం రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ములుగు జిల్లా కేంద్రంలో ఈనెల 17న జరగనున్న బస్సు యాత్ర పోస్టర్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గౌడుల సమస్యలను పట్టించుకోలేదని అన్నారు. ఇప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎలక్షన్ల సమయంలో గౌడ కులస్తుల సమస్యలను అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు కానీ నేటి వరకు కూడా కనీసం పట్టించుకున్న పాపాన పోలేదని వారు ఆవేదన వ్యక్తపరిచారు. అలాగే ఏజెన్సీ ప్రాంతాల్లో రద్దు చేయబడిన సొసైటీలను మళ్లీ పునరుద్దరణ చేస్తామని చెప్పి ఇప్పటివరకు కనీసం ఆ దిశగా ప్రయత్నం చేయకపోవడం అన్యాయమని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గీత వృత్తిని నమ్ముకుని జీవిస్తున్నటువంటి గీత కార్మికులకు 50 సంవత్సరాల నిండినా కూడా గీత కార్మికుల పెన్షన్లకు అనర్హులుగానే మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. ఇప్పటికైనా ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న అటువంటి గీత కార్మికులకు తక్షణమే గీత కార్మిక సొసైటీలను ఏర్పాటు చేసి ప్రభుత్వ నుండి రావలసిన సంక్షేమ ఫలాలను అందించే విధంగా కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఈ నెల 17న ములుగు జిల్లాలో జరిగే బస్సు యాత్రకు గీత కార్మికులందరూ కదిలి రావాలని బస్సు యాత్రను విజయవంతం చేయవలసిందిగా వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గీత కార్మికుల సంఘం గ్రామ అధ్యక్షులు గడ్డం పరమేష్, ఉపాధ్యక్షులు మండల వెంకన్న, గౌరవ అధ్యక్షులు గడ్డం చిన్న మల్లయ్య, ముత్యం నారాయణ, గడ్డం ఉప్పలయ్య, పూజారి ఏకాంతం, పిట్టల సాంబన్న, పూజారి వెంకన్న, పిట్టల సత్యం, నక్క వీరన్న, నక్క శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రాజేందర్ సింగ్ జన్మదినం సందర్భంగా అన్నదానం



**బెల్లంపల్లి, ఆగష్టు 10, (జనంసాక్షి)** తెలంగాణ కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ డిఎస్ఆర్ రాజేందర్ సింగ్ జన్మదినం సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలో బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో రాజేందర్ సింగ్ కుటుంబీకులు రామ్ సింగ్, సరోజిని, సునీత, రష్మీ, రచన, రఘువీర్ సింగ్, అరుణ, రాజ్ కుమార్, సుమన్, రుద్రాన్ష్ రాకేష్, నేహా, రాధిక, రూపేష్, ఆద్య ఇచ్చిన ఆర్థిక సహకారంతో సోమవారం సాయి భోజన్ అన్నదానం, పండ్లు పంచినట్లు సనాతన ధర్మ బాయిజమ్మ సాయి భక్తి ప్రచార ధార్మిక సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్ – రాజేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు చోట్ల యాచకులకు, మానసిక వికలాంగులకు, వృద్ధులకు, అనాథలకు, రోగులకు, పేదవారికి, అన్నార్తులకు అన్నదానం, పండ్లు పంచారు.

### ఉన్నత విద్యావేత్త

డాక్టర్ డిఎస్ఆర్ రాజేందర్ సింగ్ తెలంగాణ కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్గా ప్రస్తుతం సేవలు అందిస్తున్నారు. ఆయన ఉన్నత విద్యావేత్తగాను, ఉన్నతాధికారి హోదాలోనూ అన్ని వర్గాల వారికి అండగా ఉంటున్నారు. ముఖ్యంగా పేద విద్యార్థులకు ఎంతో సహాయకారిగా ఉంటున్నారు. కళాశాల విద్యాశాఖ పరిధిలో పనిచేసే అన్ని రకాల అధ్యాపకులకు అన్ని రకాలుగా సహాయ, సహకారాలు అందిస్తున్నారు. అలాంటి గొప్ప వ్యక్తి పేరు మీద అన్నదానం చేయడం ఆనందంగా ఉందని భాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు ఆనందం వ్యక్తం చేశారు.

### అన్నదానం చేద్దాం.. చేయూతనిద్దాం

సేవ ట్రస్ట్ ద్వారా ఆకలితో ఉన్నవారిని అతిథి సత్కారంతో ఆదరిద్దాం, అన్నదానంతో తృప్తి పరుద్దాం. సేవే లక్ష్యం సేవే మార్గంగా, మానవసేవే మాధవసేవ అనే ఉద్దేశంతో ట్రస్ట్ కొనసాగుతుందని త్రివిద్య, శ్రవిద్య, త్రయాక్షర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సేవా ట్రస్ట్ మేనేజర్ బొద్దున సతీష్, ట్రస్ట్ సభ్యులు, సేవకులు కాంపల్లి త్రివిద్య, జంగం రశ్మిత, సింగతి అక్షర, పెద్దపల్లి లహస్య, రూపం కుమారి, దేవరకొండ వర్షిని, పాల్గొన్నారు.

## అంకుశం గ్రామంలో సిపిఐ ప్రజా పోరుయాత్ర : బెల్లంపల్లి మండలం అంకుశం




**బెల్లంపల్లి, ఆగష్టు 10, (జనంసాక్షి)** గ్రామంలో సోమవారం సిపిఐ ప్రజాపోరు యాత్ర చేపట్టారు. అంకుశం గ్రామపంచాయతీ పరిధిలోని అంకుశం, లింగదరి గూడా, గోండు గూడా, కన్నాల గ్రామపంచాయతీ పరిధిలో కన్నాల ఎస్సి కాలనీ, లక్ష్మి పూర్ గ్రామాల్లో యాత్ర చేపట్టారు. ఈసందర్భంగా నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి మిట్టపల్లి వెంకటస్వామి, రాష్ట్ర సమితి సభ్యురాలు బొల్లం పూర్ణిమ మాట్లాడుతూ దేశంలో బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనలో ప్రజల జీవితాలు దుర్భరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారని అన్నారు. యువకులు ఉద్యోగాలు లేకుండా నిరుద్యోగులుగా మారుతున్నారని, విద్య వైద్య రంగాలను ప్రైవేట్ కార్పొరేట్ వ్యక్తులకు అప్ప చెప్పు ప్రజలను ఆర్థికంగా నష్టపరుస్తూ ప్రజలను అప్పుల పాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరణ చేస్తూ దేశాన్ని ఒక గశీదరగోళ పరిస్థితులకు నెట్టివేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాటాలకు సన్నద్ధం కావాలని, సెప్టెంబర్ 1 ఢిల్లీలో రామ్ లీలా మైదానంలో భారీ ఎత్తున జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, బికేఎంయూ జాతీయ కౌన్సిల్ మెంబర్ అక్కపల్లి బాపు, జిల్లా సమితి సభ్యులు మేకల రాజేశం, రత్నం రాజం, రత్నం ఐలయ్య, దాసరి తిరుపతి గౌడ్, బెల్లంపల్లి పట్టణ సహాయ కార్యదర్శి బొల్లం తిలక్ అంబేద్కర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

# క్విట్ ఇండియా స్ఫూర్తితో జైల్ భరో విజయవంతం




**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 10(జనంసాక్షి ):** సీఐటీయూ రైతు వ్యవసాయ కార్మిక సంఘాల దేశవ్యాప్త పిలుపులో భాగంగా క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో సోమవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ నుంచి బస్టాండ్ ఏరియా చౌరస్తా వరకు కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ చౌరస్తా వద్ద రాస్తారోకో చేపట్టారు. రాస్తారోకోను భగ్నం చేసేందుకు పోలీసులు ప్రయత్నించడంతో నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ కార్యక్రమానికి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా ఇన్‌చార్జి కామ్రేడ్ భూపాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా, కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, సామాన్య ప్రజలకు వ్యతిరేకంగా విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్లను వెంటనే ఉపసంహరించుకోవాలని, కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించాలని, రైతు రుణమాఫీ చట్టం తీసుకురావాలని కోరారు. ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచి సంవత్సరానికి 100 రోజుల పని హామీని పకడ్బందీగా అమలు చేయాలని, అంత్యోదయ కుటుంబాలకు ప్రస్తుతం అందిస్తున్న 35 కిలోల బియ్యాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే విధానాలను ఉపసంహరించుకోవాలని, రైతులకు ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని అన్నారు. కార్పొరేట్ అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్ తో పాటు సీఐటియు ఉపాధ్యక్షులు బాలకిషన్, శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శి వెలిశాల కృష్ణమాచారి, కేవీపీస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డి వై ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, ఐ ఎఫ్ టీ యు నాయకులు చాంద్ పాషా, టీ యు సి ఐ తిరుపతి,ఐద్వా జిల్లా సంయుక్త కార్యదర్శి నంది పద్మ, సీఐటీయూ నాయకులు మాట్ల రాజు, శంకర్, రాజేశ్వరీ,స్వరూప, గంగామణి, జయ, తేకం ప్రభాకర్, మాదవి చంద్రకళ, భీంభాయ్,సంతోష్, బుద్దు సమ్మయ్య, నవీన, వనిత, సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రభుత్వ ఉద్యోగాలకు 60 రోజుల ఉచిత శిక్షణ

- మధ్యాహ్న భోజనం, స్టడీ మెటీరియల్
- మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు



**మంచిర్యాల ప్రతినిధి, ఆగస్టు 10, జనంసాక్షి** మంచిర్యాల జిల్లాలోని నిరుద్యోగ యువతకు పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై (గా×), ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగాల్లో రాణించేందుకు 60 రోజుల పాటు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు, శిక్షణ తీసుకోవడానికి ఆసక్తి గల వారు పై క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి లింక్ ఓపెన్ చేయడం ద్వారా మీ పేరు నమోదు చేసుకొని కోచింగ్ లో చేరవచ్చని కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ సాగర్ రావు తెలిపారు. సోమవారం నాడు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఈ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. శిక్షణలో భాగంగా అర్థమెటిక్, రీజనింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ, పాలిటీ, ఇండియన్ హిస్టరీ, జాగ్రఫీ, ఇంగ్లీష్, ఎకానమీ, కరెంట్ అఫైర్స్, తెలంగాణ అంశాలు తదితర పోటీ పరీక్షలకు సంబంధించిన ముఖ్యమైన సబ్జెక్టులపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.

## విద్యార్థులకు ఉచిత భోజనం, స్టడీ మెటీరియల్

60 రోజుల శిక్షణ కాలంలో శిక్షణ పొందే విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా శిక్షణ అనంతరం వివిధ సబ్జెక్టులకు సంబంధించిన అవసరమైన స్టడీ మెటీరియల్‌ను కూడా ఉచితంగా అందించనున్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మంచిర్యాల జిల్లాలోని నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు అవసరమైన శిక్షణ, స్టడీ మెటీరియల్, భోజన సదుపాయాలను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు.

# డ్రగ్స్, గంజాయి, రోడ్డు భద్రతపై వినూత్న ప్రదర్శన




**పాలకుర్తి, ఆగస్టు 10 (జనంసాక్షి)** జనగామ జిల్లా, పాలకుర్తి మండల కేంద్రంలో ప్రతి సోమవారం జరిగే (వారపు సంత) సందర్భంగా డ్రగ్స్. గంజాయి. రోడ్డు భద్రతపై పోతురాజు వేషధారణలో సూర్యాపేట జిల్లా, మద్దిరాల మండలం, జడ్పీహెచ్ఎస్ గోరంట్ల పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయులు సామాజిక కార్యకర్త. రాచకొండ ప్రభాకర్ వినూత్న వేషధారణతో ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్రమంతటా బోనాల పండుగను ప్రజలంతా ఎట్లాంటి అనారోగ్యాల బారిన పడకుండా ఉండాలని గ్రామ దేవతలను కోరుకుంటూ జరుపుకునే పండుగలో పోతురాజు బలం ధైర్యం. చెడును తరిమికొట్టే శక్తికి ప్రతీక గా ఉంటాడు. డ్రగ్స్. గంజాయి. ధూమపానం. పొగాకు ఉత్పత్తులు మత్తు పదార్థాలు సేవించకుండా ఉండాలని, వాటి వల్ల ఎన్నో శారీరక మానసిక ఆర్థిక సామాజిక నష్టాలు కలుగుతాయని అవగాహన కల్పించారు. యువత ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ప్రణాళిక బద్ధంగా కష్టపడి లక్ష్యసాధనకు పాటుపడాలన్నారు. అదేవిధంగా రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రతి ఒక్కరు క్షేమంగా గమ్యాన్ని చేరుకోవాలని, ద్విచక్ర వాహనాలు నడిపేవారు విధిగా హెల్మెట్ వాడాలని కారు నడిపేవారు సీటు బెల్టు ధరించాలని ప్రజలను కోరారు. అదేవిధంగా మరుగున పడుతున్న జానపద కళ ల ను కూడా ఈ ప్రపంచానికి తెలియజేయాలని పోతురాజు వేషం ధరించి డ్రగ్స్. గంజాయి. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.

# ఆముదం, నువ్వుల పంటలు సాగు చేయండి



**పాలకుర్తి, ఆగస్టు 10(జనంసాక్షి)** వరి పంటకు బదులు ఆముదం, నువ్వులు. మినుములు పంటలను సాగు చేసి అధిక లాభాలు పొందవచ్చని ఏడీఏ అపర్ణ తెలిపారు. సోమవారం మండలం లోని శాతాపురం, తొర్రూరు, గూడూరు, అయ్యంగారిపల్లి, పెద్దతండా (కే) దర్దేపల్లి, విష్ణుపురం, చీమలబాయి తండా, తీగారం, మైలారం, పెద్దతండ (బీ), మల్లంపల్లి గ్రామాల్లో ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా అపర్ణ మాట్లాడుతూ రైతులు అత్యధికంగా వరి పంటనే సాగు చేస్తున్నారని, వర్షాభావం వల్ల రైతులు ప్రత్యామ్నాయ పంటలు ఆముదాలు, నువ్వు, కంది, పెసర, మినుములు పంటలను సాగు చేసి అధిక ఆదాయం పొందాలని సూచించారు. ఈ అవగాహన ఏవో విద్యాకర్రెడ్డి, సర్పంచులు లోనె శ్రీనివాస్, పసులాది యాకస్వామి, పోశాల వెంకన్న, జుమిలాల్, బాలాజీ, తిరుపతి, అనూష, విమల, ఏఈవోలు వెంకటేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనివాస్ రావు కుటుంబాన్ని పరామర్శించిన ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు



**పాలకుర్తి, ఆగస్టు 10 (జనంసాక్షి)** పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన పాలకుర్తి మాజీ జడ్పిటిసి, జనగామ జిల్లా జడ్పీ ఫ్లోర్ లీడర్. పుస్నూరి శ్రీనివాస్ రావు తల్లి పుస్నూరి ప్రమీలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, సోమవారం ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు శ్రీనివాసరావు నివాసంలో మృతురాలు ప్రమీలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం మాజీ జడ్పిటిసి పుస్నూరి శ్రీనివాస్ రావుతోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించి. తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో రాపోలు రాంబాబు,ఎండి పాషా . కొండపర్తి విష్ణుమూర్తి, గజ్జి రాజు, బొమ్మగాని ప్రదీప్ ,వర్ధమాన శ్రీనివాస్, బెల్లి బాలరాజు, భూమా ఋషి,ఎండి జమాలుద్దీన్, గుడికందిల నరేష్, అబ్బోజు యాకస్వామి తదితరులు పాల్గొన్నారు.

# గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులుగా గండి వీరేందర్ గౌడ్



**మహబూబాబాద్,ఆగస్టు 10(జనం సాక్షి):** తెలంగాణ రాష్ట్ర గౌడ సంక్షేమ సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులుగా గండి వీరేందర్ గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర గౌడ సంక్షేమ సంఘం కేంద్ర కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షులు గట్టు రామచంద్ర రావు చేతుల మీదుగా గండి వీరేందర్ గౌడ్ నియామక పత్రాన్ని అందుకున్నారు. నియామక పత్రం అందుకున్న అనంతరం గండి వీరేందర్ గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ, గౌడ జాతి అభ్యున్నతి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. గౌడ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. అలాగే గౌడ యువతకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు, సామాజికంగా మరియు ఆర్థికంగా గౌడ సమాజం అభివృద్ధి చెందేలా కృషి చేస్తానని వీరేందర్ గౌడ్ తెలిపారు. తనకు జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన తెలంగాణ రాష్ట్ర గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపకులు గట్టు రామచంద్ర రావుకి మరియు రాష్ట్ర అధ్యక్షులు గుండాల మల్లేష్ గౌడ్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మొల్కాపురి శ్రీకాంత్ గౌడ్ కు గండి వీరేందర్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# అభివృద్ధిలో సుంకిడిని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- సర్పంచ్ రాథోడ్ గణపతి
- సుంకిడిలో రూ.10 లక్షలతో వీఓ భవనానికి భూమిపూజ



**సిరికొండ ఆగస్టు 10 (జనం సాక్షి) :** గ్రామాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ, సుంకిడిని అన్ని రంగాల్లోనూ ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ రాథోడ్ గణపతి అన్నారు. సోమవారం సుంకిడి గ్రామంలో రూ.10 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న నూతన వీఓ భవనానికి ఆయన ఉపసర్పంచ్ భీమ్ రావు తో కలిసి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఓ భవనం నిర్మాణంతో మహిళా సంఘాలు, గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గ్రామ అవసరాలను గుర్తించి నిధులు మంజూరు చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. భవన నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈశ్వర్, రాహుల్, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

# ఏళ్ల కష్టాలకు కల్వర్టుతో చెక్

## నగేశ్‌నగర్ కాలనీలో రూ.5 లక్షలతో పనులు ప్రారంభం



**సిరికొండ ఆగస్టు 10 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని నగేశ్‌నగర్ కాలనీవాసుల చిరకాల రాకపోకల సమస్యకు పరిష్కారం చూపుతున్నామని సర్పంచ్ బొడ్డు దత్తాత్రి అన్నారు. సోమవారం వీబీజీ రాం జీ నిధులు రూ.5 లక్షలతో చేపట్టనున్న కల్వర్టు నిర్మాణ పనులను ఉపసర్పంచ్ రాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీవాసులు ఏళ్లుగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం. వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా కల్వర్టును పటిష్టంగా నిర్మిస్తామని పేర్కొన్నారు. కల్వర్టు అందుబాటులోకి వస్తే కాలనీవాసుల రాకపోకల కష్టాలు తీరుతాయని తెలిపారు.

# కుభీర్ మండలంలో తీవ్ర విషాదం

## ఈతకు వెళ్ళి ఇద్దరు బాలురు మృతి




**కుభీర్, ఆగస్టు 10, (జనంసాక్షి):** సరదాగా ఈతకు వెళ్లిన ఆ రెండు కుటుంబాల్లో తీరని శోకాన్ని నింపింది. సోమవారం సెలవు కావడంతో ముగ్గురు బాలురు కలిసి ఈత కొట్టడానికి వెళ్లగా.. ప్రమాదవశాత్తు ఇద్దరు బాలురు చెరువులో మునిగి మృతి చెందిన ఘటన కుభీర్ మండలంలో తీవ్ర విషాదాన్ని నింపింది. స్థానికులు వివరాల ప్రకారం... నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రానికి చెందిన సోఫియాన్ (13), దేవ్వర్ గణేష్ (10) మరో స్నేహితుడితో కలిసి స్థానిక దోడర్నా చెరువుకు ఈత కొట్టడానికి వెళ్లారు. ముగ్గురిలో ఒక బాలుడు ఒడ్డునే ఉండిపోగా, సోఫియాన్, గణేష్ ఇద్దరూ సరదాగా నీటిలోకి దిగారు. అయితే చెరువు లోతును అంచనా వేయలేకపోవడంతో ఇద్దరూ ప్రమాదవశాత్తు నీట మునిగిపోయారు. గమనించిన స్థానికులు చెరువు వద్దకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఇద్దరు బాలురను నీటిలో నుంచి బయటకు తీసేటప్పటికే సోఫియాన్ అక్కడికక్కడే మృతి చెందగా, గణేష్‌ను చికిత్స నిమిత్తం భైంసా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రాణాలు విడిచాడు. కంటిపాపల్లాంటి పిల్లలు కళ్లముందే శవాలుగా మారడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. గణేష్ మృతదేహాన్ని పట్టుకుని ఆ తల్లిదండ్రులు చేసిన ఆవేదన, రోదనలు అక్కడున్న వారిని కంటతడి పెట్టించాయి. ఈ ఘటనతో మండల కేంద్రం అంతా శోకసంద్రంలో మునిగిపోయింది. విషయం తెలుసుకున్న భైంసా ఏఎస్పీ సాయికిరణ్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కుభీర్ మండల ఎస్సై కృష్ణారెడ్డిని అడిగి ఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు.

# వేతన కమిటీని ఏర్పాటు చేయాలని జిఎం కార్యాలయం ముందు ధర్నా



**శ్రీరాంపూర్(జనంసాక్షి):** బొగ్గు గని కార్మికుల వేతనాల పెంపు కోసం 12వ వేతన కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ,ఐఎన్టీయుసి,సిఐటియు, హెచ్ఎంఎస్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏరియా సింగరేణి జిఎం కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి జిఎం శ్రీనివాస్ కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్,ఐఎన్టియుసి కేంద్ర ఉపాధ్యక్షులు పేరం రమేష్,సిఐటియు రీజియన్ కార్యదర్శి రామస్వామి,హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు తిప్పారపు సారయ్య మాట్లాడుతూ 12వ వేతన కాల పరిమితి ప్రారంభమైనప్పటికీ ఇప్పటివరకు కమిటీ ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని,దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే బొగ్గు పరిశ్రమను తమ శ్రమతో నడిపిస్తున్న కార్మికుల వేతనాల విషయంలో కాలయాపన చేయడం అన్యాయమని అన్నారు.గుర్తింపు సంఘం ఎన్నికల్లో 51 శాతం ఓట్లు ఏ సంఘానికీ రాని పరిస్థితిని సాకుగా చూపి వేతనాల పెంపు ప్రక్రియను నిరవధికంగా వాయిదా వేయడం కార్మికుల హక్కులను హరించడమేనని నాయకులు అన్నారు.కార్మికుల వేతనాలు, హక్కులు, సంక్షేమ ప్రయోజనాలపై ఎలాంటి ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నా తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. కార్మిక సంఘాలను పక్కన పెట్టి ఏ నిర్ణయం తీసుకున్నా బొగ్గు గనుల్లో తీవ్ర ప్రతిఘటన తప్పదని స్పష్టం చేశారు.వేతనాల పెంపు కోసం అన్ని కార్మిక సంఘాలు కలసి పోరాడితే ఎలాంటి కార్మిక వ్యతిరేక నిర్ణయాన్నైనా తిప్పికొట్టగలమని అన్నారు.కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తే మరింత బలమైన ఐక్య పోరాటాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య,బ్రాంచ్ కార్యదర్శి ఎస్ కే బాజీ సైదా,ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు రవీందర్ రెడ్డి, జీవన్ జోయల్, సిఐటియు నాయకులు వెంగళ శ్రీనివాస్,తోడే సుధాకర్, హెచ్ఎంఎస్ నాయకులు వీసా కొమురయ్య,దుర్గం లక్ష్మణ్,తదితరులు పాల్గొన్నారు.

# 5వ బెటాలియన్‌లో డీజీపీ పర్యటన - సమర్థవంతమైన పోలీసింగ్‌పై దిశానిర్దేశం





**గోవిందరావుపేట. ఆగస్ట్10 (జనం సాక్షి) :** చల్వాయి, : తెలంగాణ రాష్ట్ర డీజీపీ సివి ఆనంద్. 5వ బెటాలియన్ తెలంగాణ ప్రత్యేక పోలీస్, ములుగు ను సందర్శించి బెటాలియన్ అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీజీపీ గారు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ సైబర్ నేరాలు, డ్రగ్స్ వినియోగం మరియు ఆన్‌లైన్ బెట్టింగ్‌ల పై ప్రజల్లో అవగాహన కల్పించాలని వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం ప్రధానంగా బెటాలియన్ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడం, సిబ్బంది శిక్షణ, క్రమశిక్షణ, విధి నిర్వహణలో నైపుణ్యం, శారీరక దారుఢ్యం. ఆపరేషనల్ సన్నద్ధతపై డీజీపీ. దిశానిర్దేశం చేశారు. బెటాలియన్ సిబ్బంది ఎల్లప్పుడూ అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. బెటాలియన్‌లో అందుబాటులో ఉన్న మౌలిక వసతులను మరింత మెరుగుపరచడంతో పాటు, సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఆధునిక పోలీసింగ్‌కు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని, శిక్షణ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా డీజీపీ. సిబ్బందితో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను, అవసరాలను తెలుసుకున్నారు. సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. బెటాలియన్ అభివృద్ధి. సిబ్బంది సంక్షేమం కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీజీపీ (బెటాలియన్స్) సంజయ్ కుమార్. జైన్,మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఏ ఎస్ పి మనన్ బట్, శివ ప్రసాద్ రెడ్డి 4వ బెటాలియన్ కమాండెంట్, 5వ బెటాలియన్ అదనపు కమాండెంట్( ఇన్చార్జ్ కమాండెంట్ ) సీతారా, సహాయకమాండెంట్ కృష్ణ ప్రసాద్, ఆర్ఐలు. బెటాలియన్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ముఖ్యఅతిథిగా పాల్గొని దిశా నిర్దేశం చేసిన మంత్రి పొంగులేటి



**హనుమకొండ ప్రతినిధి ఆగస్టు 10 (జనం సాక్షి)** :హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆధ్వర్యంలో ఈరోజు రాష్ట్ర గౌరవ ఇంచార్జ్ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన, జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకుల అత్యున్నత స్థాయి సమన్వయ సమావేశం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించబడింది. ముందుగా డిసిసి భవన్‌కు విచ్చేసిన ఇంచార్జ్ మంత్రి కి హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి మర్యాదపూర్వకంగా సాదర స్వాగతం పలికారు.ఈ సమావేశంలో జిల్లాకు చెందిన పార్లమెంట్ సభ్యులు శ కడియం కావ్య, శాసనమండలి సభ్యులు బస్వరాజు సారయ్య, శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కె.ఆర్.నాగరాజు, హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితెల ప్రణవ్, టీపీసీసీ మహిళా అధ్యక్షురాలు శ్రీమతి ఎర్రబెల్లి స్వర్ణ, కిసాన్ కాంగ్రెస్ హనుమకొండ చైర్మన్ మరియు డిసిసి ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ చైర్మన్ పింగిలి వెంకట్రామ్ నరసింహ రెడ్డి, మాజీ మేయర్ గుండు సుధారాణి మరియు చైర్మన్లు రియాజ్, అజీజ్ ఖాన్, టిపిసిసి స్పోక్స్ పర్సన్ కూచన రవళి, టీపీసీసీ జనరల్ సెక్రెటరీస్ ఇ.వి శ్రీనివాస్ రావు, బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా చైర్మన్ అనుబంధ సంఘాల చైర్మన్లు, నూతనంగా నియమితులైన 13 మండలాల అధ్యక్షులు మరియు వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని నూతన 10 డివిజన్ల అధ్యక్షులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విడివిడిగా సమావేశమై ప్రజా సమస్యలు, పార్టీ బలోపేతంపై విస్తృతంగా చర్చించారు.హనుమకొండ జిల్లా నూతన డిసిసి కార్యాలయ నిర్మాణానికి సంబంధించిన భూమి కేటాయింపు ప్రతిపాదనను రాబోయే రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో పెట్టి, దానికి త్వరితగతిన ఆమోదం లభించేలా ఇంచార్జ్ మంత్రి ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా నాయకత్వం కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జూనియర్ కళాశాలలో ఘనంగా వెల్‌కమ్ పార్టీ




**పర్వతగిరి ఆగసు10: (జనం సాక్షి)** పర్వతగిరి మండలం కల్లెడ గ్రామంలోని ఆర్డీఎఫ్--వనితా అచ్చుతా పాయి విద్యాలయ జూనియర్ కళాశాలలో సోమవారం వెల్‌కమ్ పార్టీని ఘనంగా నిర్వహించారు. నూతనంగా కళాశాలలో చేరిన విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలుకుతూ నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలతో సందడిగా సాగింది. ఈ కార్యక్రమానికి కళాశాల పూర్వ విద్యార్థి, బంధనపల్లి గ్రామ సర్పంచ్ అక్రి రామ్‌జీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం అక్రి రామ్‌జీని శాలువాతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు గత విద్యా సంవత్సరంలో ప్రథమ సంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినుల తల్లిదండ్రులను ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. విద్యార్థుల విజయానికి తల్లిదండ్రులు అందిస్తున్న ప్రోత్సాహం, సహకారం ఎంతో కీలకమని అధ్యాపకులు పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆడెపు జనార్ధన్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు కళాశాలలో సముచిత ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్ లక్ష్యాలకు అనుగుణంగా అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధతో బోధిస్తున్నారని చెప్పారు. కళాశాలలో విద్యార్థులకు అందుబాటులో ఉన్న హాస్టల్ వసతి, విద్యా సౌకర్యాలు, భద్రత, నిత్య పర్యవేక్షణ తదితర అంశాలను వివరించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మంచి విద్యతో పాటు ప్రశాంతమైన వాతావరణంలో చదువుకునే అవకాశం కల్పించడమే కళాశాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు కళాశాలలో లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. వెల్‌కమ్ పార్టీ సందర్భంగా విద్యార్థులు, విద్యార్థినులు చేసిన ఉపన్యాసాలు, పాటలు, నృత్యాలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమలోని ప్రతిభను ప్రదర్శించడంతో కళాశాల ప్రాంగణం సందడిగా మారింది. విద్యార్థుల ప్రతిభను చూసిన అతిథులు, అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి అక్రి రామ్‌జీ విద్యార్థులను అభినందిస్తూ, కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. కళాశాలలో లభిస్తున్న విద్యా, ఇతర సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎ. రాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సతీష్,అధ్యాపకులు జయశంకర్, మహేశ్వర్, సైదులు, సంతోష్, దంజ్య, విల్సన్ బాబు, వేణు, గుంషావళి, ప్రవీణ్, శ్రీలత, ధనలక్ష్మి, తిరుమల, పిడి బి.రాజు తదితరులు పాల్గొన్నారు.విద్యార్థుల ఉత్సాహభరితమైన ప్రదర్శనలు, ముఖ్య అతిథి సన్మానం, ప్రతిభావంతులైన విద్యార్థుల తల్లిదండ్రుల అభినందనలతో వెల్‌కమ్ పార్టీ ఆద్యంతం ఆహ్లాదకరంగా సాగింది.

# ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా గిర్నిబావిలో నిరసన



**దుగ్గొండి, ఆగస్టు 10 (జనం సాక్షి):** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రజాసంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం సిఐటియు. తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం .ఆధ్వర్యంలో జైల్ బరో కార్యక్రమాన్ని గిర్ని బావి సెంటర్లో నిర్వహించారు. సోమవారం మండలంలోని గిర్నిబావి సెంటర్లో రైతు సంఘం సిఐటియు నాయకులు పాల్గొని నర్సంపేట వరంగల్ ప్రధాన రహదారిపై నిరసన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా రైతు సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు పుచ్చకాయల కృష్ణారెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన ప్రజావ్యతిరేక విధానాలు వ్యతిరేకంగా నిరసనకు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కార్డులను రద్దు చేయాలని, కార్మికుల ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశా, అంగన్వాడి, గ్రామపంచాయతీ వర్కర్లకు.కనీస వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. పెంచిన ఎరువులు ధరలు తగ్గించాలని. నూతన విద్యుత్ చట్టాన్ని సవరణ చట్టాన్ని. ఉపశమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్వామినాథ కమిషన్ ప్రకారం రైతులకు పంటలు ధర నిర్ణయించాలని. ఉపాధి హామీ పనులను 200 రోజులు కల్పించాలని భారతదేశంలోని పబ్లిక్ రంగ సంస్థలను ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పుచ్చకాయ నరసింహారెడ్డి, అధ్యక్షులు బోళ్ల సాంబయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి అక్కపెల్లి సుధాకర్, అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి, కొంగర నరసింహా స్వామి, కోడం రమేశ్, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా నాయకులు పుట్టపాక రాజేందర్ చిలువేరు నారాయణ శివరాత్రి సాంబయ్య గొర్రె సంజీవరెడ్డి పాల్గొన్నారు.

# పరకాలలో ఈ నెల 16వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభ విజయవంతం చేయాలి



### పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి


**పరకాల, ఆగస్టు 10, (జనం సాక్షి):** సోమవారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పరకాల టౌన్ మరియుపరకాల,నడికూడ మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ నెల 16వ తేదీన పరకాల పట్టణ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే బహిరంగ సభను అత్యంత విజయవంతం చేయడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని అన్నారు. బూత్ లెవెల్ నుంచి ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేసి, ప్రజలను పెద్ద ఎత్తున సభకు తరలించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.కమిట్‌మెంట్‌తో కూడిన బలమైన ఆర్గనైజేషన్‌తో ప్రతి గ్రామం, ప్రతి బూత్‌లో సమన్వయంతో పనిచేస్తే సభ చారిత్రాత్మక విజయాన్ని సాధిస్తుందని అన్నారు.సభ ఏర్పాట్లు, ప్రజల రవాణా, ప్రచార కార్యక్రమాలు, బాధ్యతల కేటాయింపు తదితర అంశాలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన నిర్మల్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కూచారి శ్రీహరి రావు



**లక్ష్మణ చందా, ఆగస్టు 10 (జనం సాక్షి)** మండలంలో అనారోగ్యంతో బాధపడుతున్న రాచపూర్ సర్పంచ్ బూసి మహేష్, మరియు వద్యల్ కిరణ్ సింగ్ కుమారుడు కుందన్ సింగ్ కుటుంబాన్ని సోమవారం రోజున పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ వారు త్వరగా కోలుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ ఏఎంసీ చైర్మన్ సోం భీమరెడ్డి, వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొండ్ర నరేష్ రెడ్డి, సీనియర్ నాయకులు ప్రతాప రెడ్డి, వద్యాల్ సర్పంచ్ పసుపుల నరేష్, ఉప సర్పంచ్ పోశెట్టి మరియు తదితరులు ఉన్నారు.


# పాపం ఎవరిది..మృతికి కారణం ఎవరు



**నస్పూర్(జనంసాక్షి):** మంచిర్యాల జిల్లాలో చెత్తకుప్పలో దొరికిన పసికందు పాపం ఎవరిది అంటున్న సమాజం. నస్పూర్ మండలంలోని లక్ష్మీ నగర్ చోటు చేసుకున్న సంఘటన పుట్టిన బాబుని చెత్త బుట్టలో పడేసిన వైనం సమాజాన్ని ఆలోచనలో పడేసింది.లక్ష్మీనగర్లో నివాసం ఉంటున్న ఒక మహిళ నవమాసాలు మోసి కొడుకుకు జన్మ ఇచ్చి నిమిషాలలో చెత్తకుప్పలో పడేసిన వైనం అందరినీ విస్మయపరిచింది.నవ మాసాలు మోసి ప్రాణం పోసిన కన్నతల్లి పడేసి వెళ్ళిపోతే సమాజం ఏమి అంటుంది.లోకం తెలియని ఆ పసికందు పుట్టి కొన్ని గంటలు కూడా కాలేదు.అమ్మ ఒడిలో ఉండాల్సిన ఆ పసి గుడ్డు వీధిలో ఎండకు ఎండకు ఎండుతూ ఈగలు ముసురుతున్న చెత్త కుప్పలో పడి ఉంటే సమాజానికి భయపడాలా బాధ్యత లేకుండా చేసిన తల్లికి భయపడాలా మానవులను కలవపరుస్తున్న సంఘటన.అమ్మ అంటే కన్న పిల్లకు రక్షణ కవచం అలాంటి ఓ తల్లి అమ్మతనానికి అర్థం లేకుండా చేసింది.తన విచ్చలవిడి తనానికి ఒక ప్రాణాన్ని తృణప్రాణంగా వదిలేసింది.ఆ వైపుగా వెళుతున్న జిమ్ ట్రైనర్ శిరీష పసికందును చూసి చొరవ తీసుకొని తన మానవత దృక్పథాన్ని తెలియజేసింది.108 కాల్ చేయగా సిబ్బంది వచ్చి మంచిర్యాలలోని మాతా శిశు కేంద్రానికి తరలించారు. అనంతరం తను చికిత్స పొందుతూ మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఎస్ఐఆర్ సర్వేలో 87.19 శాతం ఓటర్ల వివరాల డిజిటలైజేషన్

### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ బ్యూరో ఆగస్టు 10(జనం సాక్షి)** వరంగల్ జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వే ప్రక్రియలో గణనీయమైన పురోగతి నమోదైందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు.ఆగస్టు 10 ఉదయం 7.59 గంటల వరకు జిల్లాలోని నర్సంపేట, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో 7,76,953 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. మొత్తం 795 మంది బీఎల్ఓల ద్వారా 100 శాతం ఫారాలు పంపిణీ, సేకరణ ప్రక్రియ పూర్తయింది. ఇప్పటివరకు 6,77,412 ఎలక్షన్ ఫారాలు డిజిటలైజ్ చేసి 87.19 శాతం ప్రక్రియను పూర్తి చేశారు.నియోజకవర్గాల వారీగా నర్సంపేటలో 92.36 శాతం, వరంగల్ తూర్పులో 80.22 శాతం, వర్ధన్నపేటలో 89.26 శాతం డిజిటైజేషన్ పూర్తయిందన్నారు.6,77,286 ఫారాలను బీఎల్ఓలు వెరిఫై చేయగా, 18,110 ఫారాలను ఓటర్లు స్వయంగా సమర్పించారు. 99,541 ఫారాలు (12.81 శాతం) డబుల్ ఓటర్లు చనిపోయిన,షిఫ్టెడ్ అయిన ఓటర్లుగా గుర్తించడమైనదని, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

# బీజేపీ పాలనలో రాముడికే రక్షణ లేదు

- దేశ ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసిన ఘనత బీజేపీ ప్రభుత్వంది
- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

హనుమకొండ ప్రతినిధి ఆగస్టు 10 (జనం సాక్షి) :కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసిన ఘనతను సొంతం చేసుకుందని, రామభక్తులం అని చెప్పుకునే మోదీ, అమిత్ షా, బిజెపి నేతలు వారి పాలనలో అయోధ్య రాముడికి రక్షణ లేకుండా పోయిందని, అక్రమార్కులకు బిజెపి అడ్డగా ఉందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ సమితి పిలుపు మేరకు ఆగస్టు 6న కాజీపేటలో ప్రారంభమైన సిపిఐ ప్రచార జాత యాత్ర సోమవారం 5వ రోజున హనుమకొండ మండలానికి చేరుకొని జీటీ రెడ్డి నగర్ నుండి ప్రచార జాతా పాదయాత్ర పుర వీధుల మీదగా పలువేల్పుల వరకు ఉత్సాహపూరితంగా సాగింది. ఈ సందర్భంగా హనుమాన్ నగర్ చేపల బ్రిడ్జి వద్ద జాతా బృందానికి హనుమకొండ మండల పార్టీ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అలాగే హనుమాన్ నగర్ లో రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్ ఆధ్వర్యంలో పూలమాలలతో స్వాగతం పలుకగా బతుకమ్మలతో, కోలాట బృందాలతో జాత పాదయాత్ర కొనసాగింది. హనుమాన్ నగర్ కేంద్రంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైనా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ రామభక్తులం అని చెప్పుకునే మోదీ, అమిత్ షా, బిజెపి నేతలు వారి పాలనలో అయోధ్య రామాలయం రూ.200 కోట్ల రూపాయల చోరీ చోరీ జరిగితే ఇంతవరకు విచారణ చేయలేదన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు గత యూపీఏ ప్రభుత్వం చేతకాని ప్రభుత్వమని ఆకాశాన్ని అంటుతున్నాయని, ప్రజా సమస్యల పైన పోరాటాలు కొనసాగిస్తూ మార్పు రావాలి మోదీ ప్రభుత్వం దిగాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1వ తేదీన ఛలో ఢిల్లీ పిలుపునివ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.







**గోవిందరావుపేట ఆగస్ట్10:( జనం సాక్షి )** రైతులు కార్మికుల తిరగబడితే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి పతనం తప్పదని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సోమ మల్లారెడ్డి హెచ్చరించారు. సోమవారం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అఖిలభారత సంయుక్త సంఘాల జైల్ భరో పిలుపులో భాగంగా సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల రాకపోకలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పొదిల్లా చిట్టిబాబు, తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తీగల ఆగిరెడ్డి. ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి గొంది రాజేష్. కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల మురళి, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల నాయకులు ధనలక్ష్మి ,భాగ్య లక్ష్మి పి సరిత అరుంధతి. పద్మావతి.గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి గరుగు ఐలయ్య, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు కొట్టె కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు

**ఏటూరునాగారం, ఆగస్టు 10(జనంసాక్షి) :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశవ్యాప్తంగా నిర్వహించిన జైల్ భరో కార్యక్రమంలో భాగంగా ఏటూరునాగారం మండల కేంద్రంలో భారీ రాస్తారోకో నిర్వహించారు. మంగపేట, కన్నాయిగూడెం మండలాలకు చెందిన కార్మికులు, వ్యవసాయ కార్మికులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా ఏటూరునాగారం ఎంపీడీవో కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి వై జంక్షన్ వరకు చేరుకుని, అనంతరం జాతీయ రహదారి 163పై రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమం సందర్భంగా ఎస్ఐ మహేష్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రాస్తారోకోను విరమించాలని పోలీసులు పలుమార్లు సూచించినప్పటికీ ఆందోళనకారులు తమ నిరసనను కొనసాగించారు. దీంతో పోలీసులు ఆందోళనకారులను అరెస్టు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## రైతుకు అండగా.. వ్యవసాయానికి భరోసాగా రాష్ట్ర ప్రభుత్వం

వివిధ ఉత్పత్తుల గురించి రైతులు నిపుణులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, ఏడీఏ ఆదిరెడ్డి, జిల్లా మత్స్య శాఖ అధికారి శ్రీపతి, జిల్లా హార్టికల్చర్ అధికారి కమలాకర్ రెడ్డి, శ్రీనివాస్ రావు, వివిధ శాఖల అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు, ప్రగతిశీల రైతులు, జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

## సూర్యచంద్రులున్నంత వరకు ప్రజల గుండెల్లో పెద్ది

స్ఫూర్తిగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే నర్సంపేట మెడికల్ కళాశాలకు పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెట్టడం ఖాయమని భరోసానిచ్చాడు. అనంతరం మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు మాట్లాడుతూ దివంగత నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటామని అన్నారు. పెద్దికి తనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ కన్నీటి పర్యంతం అయ్యారు. తెలంగాణ ఉద్యమ పోరాటంలో కలిసి పని చేశామని పేర్కొన్నారు. పెద్ది మరణం వరంగల్ జిల్లాకే కాకుండా బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి గొప్ప నాయకున్ని కోల్పోవడం దురదృష్టకరమని అన్నారు. నర్సంపేట నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులను చేసి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన నాయకుడిగా పెద్ది పేరు ప్రతిష్టలు సంపాదించాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, తాటికొండ రాజయ్య,మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు ఆరూరి రమేష్, వినయ్ భాస్కర్, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మండల నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కర్రెగుటల్లో డీజీపీ పర్యటన

అభివృద్ధికి బాటలు పడుతున్నాయి. ఏప్రిల్ 7న కర్రెగుటలలోని సిఆర్పిఎఫ్ 39 పామునూరు బెటాలియన్ ను అప్పటి డిజిపి బి.శివధర్ రెడ్డి సందర్శించి మారుమూల ప్రాంతాల అభివృద్ధి నాంది పలికితే.. సోమవారం కర్రెగుట్టల పర్యటనకు వచ్చిన డీజీపీ సివి ఆనంద్ మరో అడుగు ముందుకు వేసి పామునూరు బెటాలియన్ ను దాటి చెలిమల, దోలి, తడపాల మీదుగా సుమారు 28 కిలోమీటర్ల మేర నిర్మించిన రహదారిని పరిశీలించి కర్రెగుటలలో శాశ్వత అభివృద్ధికి అనుసరించాల్సిన విధానాలపై అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. అక్కడి నుంచి కర్రెగుట్టల్లో అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టిన రహదారి పనులను పరిశీలించారు. పామునూరు, చెలిమల, దోలి, తడపాల మీదుగా సుమారు 28కిలోమీటర్ల మేర నిర్మించిన రహదారిని పరిశీలించి అక్కడ జెండా ఎగురవేసి, శాంతికపోతాలని గాల్లోకి వదిలారు. ఈ క్రమంలో అక్కడ పనుల్లో అనుసరించాల్సిన విధానాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. పామునూరులో నివాసం ఉంటున్న గుత్తి కోయలకు బియ్యం, దుప్పట్లు అందజేసి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం కూడా అందించామని తెలిపారు. త్వరలోనే ఈ ప్రాంతం అరణ్య ప్రాంతమైనప్పటికీ అటవీశాఖతో కలిసి చూడదగ్గ ప్రదేశాలను గుర్తించి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని డీజీపీ వెల్లడించారు.

40 ఏళ్ల మావోయిస్టు జీవితం.. జనజీవన స్రవంతిలోకి..

దాదాపు నాలుగు దశాబ్దాలుగా మావోయిస్టు ఉద్యమంలో అండర్‌గ్రౌండ్‌లో కొనసాగిన సీపీఐ (మావోయిస్టు) సీనియర్ నాయకురాలు కాకర్ల సమత అలియాస్ మాధవి, షకీలా, దుర్గా తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ములుగులో డీజీపీ సీవీ ఆనంద్ విలేకరుల సమావేశంలో ఆమె నేపథ్యం, పార్టీ బాధ్యతలు, కుటుంబ వివరాలు, ప్రభుత్వం అందిస్తున్న పునరావాస సదుపాయాలను వెల్లడించారు. మావోయిస్టు పార్టీ జనరల్ సెక్రటరీ ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, ఆయన భార్యతో పాటు అండర్‌గ్రౌండ్‌లో ఉన్న సీనియర్ నాయకత్వం హింసా మార్గాన్ని వీడి లొంగిపోవాలని పోలీసులు మరోసారి విజ్ఞప్తి చేశారు.



## దేవరుప్పులలో ఘనంగా ఆషాఢ మాస గోరింట వేడుకలు

**దేవరుప్పుల, ఆగస్టు 10 (జనం సాక్షి):** దేవరుప్పులలో మహిళామణుల ఆధ్వర్యంలో ఆషాఢ మాస గోరింట వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఒకరికొకరు గోరింటాకు పెట్టుకుంటూ పాటలు, ఆటపాటలతో సందడి చేశారు. సంప్రదాయ దుస్తుల్లో మహిళలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ మహిళల మధ్య ఐక్యత, స్నేహభావాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కౌసల్య, సుప్రియ, నిర్మల, సంధ్య, కవిత, నర్మద, మమత, సరిత, నాగమణి, శోభారాణి, లక్ష్మి, శశిరేఖ, పద్మ, రేణుక, అరుణ తదితరులు పాల్గొన్నారు.

# తూర్పు డివిజన్‌ను శాసిస్తున్న ఆర్ఎంపీలు!

పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడింపు వంటి అంశాల్లో నిబంధనలు పాటిస్తున్నారా అనే దానిపై సంబంధిత వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. పరీక్షల ఫలితాల ఆధారంగా మందులు సూచించడం లేదా రోగులకు భయాందోళనలు కలిగించే విధంగా వ్యవహరించడం జరుగుతోందా అన్న అంశంపైనా సమగ్ర విచారణ అవసరమని స్థానికులు అంటున్నారు.

**మెడికల్ షాపుల నిర్వహణపైనా ఆరోపణలు**

కొన్ని గ్రామాల్లో వైద్య సేవలు అందించే వ్యక్తులే మందుల విక్రయ కేంద్రాలను కూడా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులు విక్రయిస్తున్నారా? నిషేధిత లేదా నియంత్రిత మందుల విక్రయాలు జరుగుతున్నాయా? మందుల నిల్వ, విక్రయాలకు సంబంధించిన అనుమతులు, రికార్డులు సక్రమంగా ఉన్నాయా? అనే అంశాలపై ఔషధ నియంత్రణ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

**పేదలే లక్ష్యంగా దందా?**

గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అందుబాటులో ఉన్నప్పటికీ వైద్య సిబ్బంది కొరత, దూరం, రవాణా సమస్యలు వంటి కారణాలతో ప్రజలు స్థానికంగా అందుబాటులో ఉన్న వైద్య సేవలపైనే ఆధారపడుతున్న పరిస్థితి ఉంది. దీనిని ఆసరాగా చేసుకుని కొందరు అనధికారికంగా వైద్య సేవలు అందిస్తూ ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చికిత్స, మందులు, ఇంజెక్షన్లు, పరీక్షలు అంటూ ఒక్కో రోగి నుంచి వేర్వేరుగా వసూళ్లు చేస్తున్నారనే ఫిర్యాదులు కూడా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించిన వాస్తవాలను అధికారులు అధికారికంగా నిర్ధారించాల్సి ఉంది.

**అధికారుల తనిఖీలు ఎక్కడ?**

తూర్పు డివిజన్‌లో గ్రామాల వారీగా అనధికారిక వైద్య సేవలు, అక్రమంగా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న క్లినిక్‌లు, అనుమతులు లేని పరీక్షా కేంద్రాలు, మెడికల్ షాపులపై సమగ్ర తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. వైద్య ఆరోగ్య శాఖ, డ్రగ్ కంట్రోల్ అధికారులు, సంబంధిత స్థానిక యంత్రాంగం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి అర్హతలు, రిజిస్ట్రేషన్లు, అనుమతులు, మందుల విక్రయ రికార్డులు, పరీక్షా కేంద్రాల ప్రమాణాలను పరిశీలిస్తే అసలు పరిస్థితి వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న ఈ అంశంపై అధికారులు తక్షణమే స్పందించి, వాస్తవాలను నిగ్గు తేల్చి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు. అదే సమయంలో అర్హతతో, చట్టబద్ధంగా సేవలందిస్తున్న గ్రామీణ వైద్యులపై అనవసర ఆరోపణలు రాకుండా అధికారులు స్పష్టమైన తనిఖీలు, ఆధారాలతో చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.